www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 126 ఆదివారం, సెప్టెంబర్ 20, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

# వికసిత్ భారత్‌లో తెలంగాణది
# కీలక పాత్ర



**2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం**

**దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను 5 నుంచి 10 శాతానికి పెంచే దిశగా ప్రణాళిక**

**ప్రభుత్వ రుణాలపై ఆధారపడే విధానం నుంచి ప్రయివేటు, సంస్థాగత పెట్టుబడుల సమీకరణ వైపు అడుగులు**

**క్యూర్-ప్యూర్-రేర్ విధానంతో రాష్ట్రవ్యాప్తంగా సమతుల్య అభివృద్ధి**

**30 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీ**

**యువతే తెలంగాణకు అతిపెద్ద బలం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 19 :**వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో తెలంగాణ కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దేశం నిర్దేశించుకున్న భారీ ఆర్థిక లక్ష్యాలను సుదూర ఆశయాలుగా కాకుండా, తక్షణ కార్యాచరణ బాధ్యతగా తెలంగాణ భావిస్తోందని వివరించారు. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో న్యూఢిల్లీలో జరిగిన 'వికసిత్ భారత్ దిశగా భారతదేశ ప్రయాణానికి ఆర్థిక వనరుల సమీకరణ' సదస్సులో శనివారం డిప్యూటీ సీఎం ప్రసంగించారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆర్థిక మంత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, ఆర్థిక నిపుణులు ఈ సదస్సులో పాల్గొన్నారు. తెలంగాణ నుంచి డిప్యూటీ సీఎంతో పాటు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.వికసిత్ భారత్ నిర్మాణాన్ని కేంద్రం లేదా రాష్ట్రాలు విడివిడిగా సాధించలేవని, సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రం--రాష్ట్రాలు కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు వనరులను సమర్థంగా సమీకరించడంతో పాటు బలమైన సంస్థలు, పరస్పర సహకార విధానాలు అవసరమన్ని తెలిపారు. తెలంగాణ కేవలం నిధులను కోరేందుకు కాకుండా, స్పష్టమైన అభివృద్ధి ప్రణాళిక, ఆర్థిక వనరుల సమీకరణకు నిర్దిష్ట విధానం, దీర్ఘకాలిక లక్ష్యంతో ఈ చర్చలో భాగస్వామ్యమవుతోందని తెలిపారు.**ప్రయివేటు పెట్టుబడుల సమీకరణకు ప్రాధాన్యం** 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నిర్మించాలంటే మౌలిక వసతులకు నిధులు సమకూర్చే విధానంలో

మిగతా2లో...



# యూపీఐపై చార్జీల కత్తి

- ప్రజల చెల్లింపులపై కొత్త భారానికి రంగం సిద్ధం
- మోడీ సర్కారు డిజిటల్ మోడల్‌కు ఇదేనా కొత్త దిశ?
- డిజిటల్ ఇండియా అంటూ కేంద్రం ప్రచారం
- ఎండీఆర్ పేరుతో వినియోగదారులపై పరోక్ష వడ్డన!
- కేంద్రం నిర్ణయంపై ఆర్థిక నిపుణులు విస్మయం

**న్యూఢిల్లీ 19 :** డిజిటల్ ఇండి యా.. నగదు రహిత ఆర్థిక వ్యవస్థ.. ఆర్థిక సాధికారత అంటూ ప్రచారం చేసుకుంటున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇప్పుడు యూపీఐ వ్యవస్థలో ఛార్జీల చర్చను తెరపైకి తెచ్చింది. ప్రజల రోజువారీ జీవితంలో అంతర్భాగంగా మారిన యూపీఐపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే నిర్ణయం.. డిజిటల్ చెల్లిం పుల సౌలభ్యంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రజల కు ఉచితంగా, సులభంగా అందుబాటులో ఉన్న వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన సమ యంలో.. నిర్వహణ ఖర్చుల పేరుతో కొత్త ఆర్థిక నమూనాను తీసుకురావడం ఎందుకు? ప్రజలపై పరోక్ష భారం పడనుందా?

మిగతా2లో...

# రష్యాపై కఠిన ఆంక్షల బిల్లుపై
# ట్రంప్ సంతకం

**- భారత్‌కు 100 శాతం టారిఫ్ ముప్పు..!**



**వాషింగ్టన్ సెప్టెంబర్ 19 :** రష్యా నుంచి చమురు, గ్యాస్ దిగుమతి చేసుకునే దేశాలపై అత్యధికంగా 100 శాతం వరకు సుంకాలు విధించే నూతన ఆంక్షల బి ల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధి కారికంగా సంతకం చేశారు.

మిగతా2లో...

# మరిన్ని రంగుల్లో
# యూనిఫామ్స్ ఇవ్వండి

**● వచ్చే ఏడాది కోసం ఇప్పటి నుంచే ప్రణాళిక చేయాలి ● విద్యార్థులకు నాణ్యమైన సామాగ్రి ఇవ్వాలి ● సమీక్షా సమావేశంలో సీఎం ఏ రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్,సెప్టెంబర్ 19 :** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించే యూనిఫాం మరింత ఆకర్షణీయమైన రంగుల్లో ఉండాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి సూచించారు. డిజైన్లలో వైవిధ్యానికి ప్రయత్నించాలని చెప్పారు. శనివారం నాడాయన విద్యార్థులకు అందించే యూనిఫాం, ఇతర సామగ్రి పంపిణీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పీ సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులుతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు సబ్యసాచి ఘోష్, బాల మాయాదేవి, అహ్మద్ నదీమ్, దివ్య దేవరాజన్, నవీన్ నికోలస్, శ్రుతి ఓజా,

మిగతా2లో...



# వరంగల్ విమానాశ్రయానికి పేరును
# సూచించండి :సీఎం

**హైదరాబాద్,సెప్టెంబర్ 19 :** ప్రజలు సుదీర్ఘకాలంగా ఎదురు చూసిన కల సాకారం కాబోతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ప్రపంచస్థాయి ప్రమా ణాలతో కూడిన వరంగల్ ఎయిర్ పోర్టులో విమానాలు ఎగరబోతున్నాయని తెలిపారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ దీర్ఘకాలంగా పెండింగ్ కలను నెరవేర్చలేదని తెలిపారు. దానికి బదులుగా ఆ పార్టీ నాయకులు విలాసవంతమైన ఫాంహౌస్‌లు,

మిగతా2లో...

# హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు
# శ్రీరామరక్ష

**● ఫిరాయింపులను ప్రోత్సహించిన బీఆర్ఎస్ కు చెంపపెట్టు ● ఎప్పుడు ఉప ఎన్నిక వచ్చినా కాంగ్రెస్ సిద్ధం ● కేసీఆర్ ఫాంహౌజ్ పై ప్రజలకు నిజాలు తెలియాలి ● బీజేపీది పార్టీలను చీల్చేతత్వం ● మోదీ, అమిత్‌షా ప్రజాస్వామ్యాన్ని నాశనం చేశారు : పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్**







## తెలంగాణలో మరో 5 రోజుల వరకు
# భారీ వర్షాలు..

**బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా పెరగనున్న వానలు**

**ములుగు, ఖమ్మం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**

**రాష్ట్రంలో ఇప్పటివరకు 19 శాతం లోటు వర్షపాతం నమోదు**

**అప్రమత్తంగా ఉండాలన్న అధికారులు**

# ఎల్‌నినో రాష్ట్రంలోనే ఉందా!
# ఆంధ్రా, కర్నాటకలో లేదా.?

**● ప్రకృతిది కాదు..కాంగ్రెస్ తెచ్చిన కరువు ● రేవంత్ రెడ్డిది అసమర్థ పాలన..ఎకరం ఎండినా సీఎందే బాధ్యత ● పార్టీ ఫిరాయింపులో హైకోర్టు తీర్పు చెంపపెట్టు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ● వనపర్తి జిల్లాలో జూరాల కాలువ, సబ్ స్టేషన్ల పరిశీలన**



ఆదివారం,
సెప్టెంబర్ 20, 2026

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# యూపీఐపై చార్జీల కత్తి

(మొదటి పేజీ తరువాయి)

అన్నదే ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. కేంద్రం తాజా నిర్ణయంపై ఆర్థిక నిపుణులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. **'నాలుగు శాతమే' అంటూ ప్రభావాన్ని తగ్గించి చూపే ప్రయత్నం** రూ. 2,000లోపు లావాదేవీలు 96 శాతం ఉన్నాయని, కేవలం 4 శాతం వ్యాపారి లావాదేవీలకే ఎండీఆర్ వర్తిస్తుందని ఎన్‌పీసీఐ వివరణ ఇచ్చింది. అయితే లావాదేవీల సంఖ్యను మాత్రమే చూపిస్తూ సమస్యను చిన్నదిగా చూపడం సరైన విధానం కాదని ఆర్థిక నిపుణులు అంటున్నారు. మొత్తం వ్యాపారి లావాదేవీల విలువలో 67 శాతం రూ. 2,000కు మించిన లావాదేవీల నుంచే వస్తున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. వైద్య ఖర్చులు, పాఠశాల ఫీజులు, ఇంటి అద్దెలు, నెలవారీ సరుకులు, మొబైల్ ఫోన్ కొనుగోళ్లు వంటి సాధారణ అవసరాల్లోనూ రూ. 2,000కు మించిన చెల్లింపులు ఉంటాయి. అందువల్ల ఎండీఆర్ ప్రభావం కొద్దిమంది సంపన్నులకు మాత్రమే పరిమితమవుతుందని చెప్పడం వాస్తవ పరిస్థితిని పూర్తిగా ప్రతిబింబించదని వారు చెప్తున్నారు. **వ్యాపారుల ఖర్చులు.. ప్రజలపై పరోక్ష భారం** ఎండీఆర్ ఛార్జీలను వినియోగదారులపై మోపకూడదని ప్రభుత్వం చేప్తోంది. అయితే వ్యాపారుల ఖర్చులు పెరిగినప్పుడు వాటిని ఇతర మార్గాల్లో భర్తీ చేసే అవకాశాన్ని పూర్తిగా కొట్టిపారేయలేం. ఇప్పటికే వివిధ డిజిటల్ సేవల్లో కన్వీనియెన్స్ ఫీజులు, ప్లాట్‌ఫామ్ ఫీజులు, ఇతర రుసుముల పేరుతో వినియోగదారులపై ఖర్చులు పెరుగుతున్నాయి. యూపీఐ లావాదేవీలకు సంబంధించిన ఖర్చులు పరోక్షంగా వినియోగదారులకు చేరకుండా పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థ ఉందా? అన్నదే కీలకంగా మారింది. ప్రజలకు అందుబాటులో ఉన్న డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చే ముందు, దాని ప్రభావాలపై ప్రభుత్వం సమగ్రంగా వివరాలు వెల్లడించాలని మేధావులు సూచిస్తున్నారు.

# రష్యాపై కఠిన ఆంక్షల బిల్లుపై ట్రంప్ సంతకం

(మొదటి పేజీ తరువాయి)

ఈ చట్టాన్ని అమలు చేసే విషయంలో ట్రంప్ యంత్రాంగానికి విస్తృతమైన అధికారాలు లభించాయి. దీంతో భారత్, చైనా దేశాలు తీవ్రమైన అమెరికా సుంకాల ముప్పును ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ నూతన చట్టం ప్రకారం.. రష్యా నుంచి అత్యధికంగా ముడిచమురు లేదా గ్యాస్ దిగుమతి చేసుకునే టాప్-5 దేశాల నుంచి అమెరికాలోకి దిగుమతయ్యే వస్తువులపై 30 రోజుల్లోపు 100 శాతం వరకు టారిఫ్‌లు విధించడానికి వీలుంటుంది. అదే విధంగా ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత కొత్తగా రష్యా ఇంధనాన్ని కొనుగోలు చేసే దేశాలు లేదా రష్యా ఆంక్షల నుంచి తప్పించుకోవడానికి సహకరిస్తున్న టాప్-5 దేశాలను కూడా ఈ నిబంధన వర్తింపజేయనున్నారు. భారత్, చైనా దేశాలు రష్యన్ ఆయిల్‌ను కొనుగోలు చేస్తున్న ప్రధాన దేశాల జాబితాలో ఉన్నప్పటికీ ఈ బిల్లులో నిర్దిష్ట దేశాల పేర్లను స్పష్టంగా పేర్కొనలేదు. అలాగే టాప్-5 జాబితాను ఏ ప్రాతిపదికన లెక్కిస్తారనే దానిపై కూడా స్పష్టత లేదు. దీనివల్ల ఏ దేశాలపై సుంకాలు విధించాలనే అంశంపై ట్రంప్ యంత్రాంగానికి పూర్తి విచక్షణాధికారం లభించింది. నవంబర్‌లో మధ్యకాలిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వినియోగదారులపై భారం పడకుండా, ఇంధన ధరలు పెరగకుండా ట్రంప్ ఈ నిర్ణయం అమలులో కొంత సమయం తీసుకోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. గత 40 ఏళ్లలో కార్యనిర్వాహక శాఖకు కాంగ్రెస్ కొత్త టారిఫ్ అధికారులను కట్టబెట్టడం ఇదే మొదటిసారని వైట్‌హౌస్ లెజిస్లేటివ్ డైరెక్టర్ జేమ్స్ బ్రైడ్ తెలిపారు. కాగా ఏ దేశాలను లక్ష్యంగా చేసుకుంటారనే దానిపై స్పష్టత లేకపోవడం పట్ల ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. భారత్, బ్రెజిల్, జపాన్, యూరోపియన్ యూనియన్ దేశాల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు నేషనల్ ఫారిన్ ట్రేడ్ కౌన్సిల్ ఉపాధ్యక్షురాలు జెనెట్ చు తెలిపారు. కొత్త టారిఫ్‌లు తమ ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపుతాయని భారత్ ఇప్పటికే హెచ్చరించగా, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా అమెరికా అనుసరిస్తున్న ఏకపక్ష విధానాలను చైనా తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ బిల్లులోని నిబంధనలు అస్పష్టంగా ఉన్నాయని, అధ్యక్షుడు తన విచక్షణాధికారాన్ని దుర్వినియోగం చేసే అవకాశం ఉందని కొందరు

# వికసిత్ భారత్‌లో తెలంగాణది కీలక పాత్ర

(మొదటి పేజీ తరువాయి)

మార్పు అవసరమని భట్టి విక్రమార్క వివరించారు. రోడ్లు, వంతెనలు, ఇతర మౌలిక వసతుల కోసం ప్రభుత్వ రుణాలపైనే అధికంగా ఆధారపడే పద్ధతి నుంచి క్రమంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రయివేటు పెట్టుబడులు, సంస్థాగత నిధులు, సావరిన్ ఫండ్స్ నుంచి అధిక మొత్తంలో పెట్టుబడులను సమీకరించి, ప్రభుత్వ నిధులను వ్యూహాత్మకంగా వినియోగించే నమూనా వైపు తెలంగాణ అడుగులు వేస్తోందన్నారు. ప్రాజెక్టుల్లో పెట్టుబడిదారుల రిస్కను తగ్గించడం, వయబిలిటీ గ్యాప్‌లను పూడ్చడం, ప్రయివేట్ పెట్టుబడులకు విశ్వాసం కల్పించడం వంటి అంశాల్లో ప్రభుత్వ నిధులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఇందుకోసం పబ్లిక్--ప్రయివేట్ భాగస్వామ్యాలు (పీపీపీ), గ్రీన్ బాండ్లు, బ్లెండెడ్ ఫైనాన్స్ వంటి మార్గాలను బలోపేతం చేస్తున్నట్టు చెప్పారు. **క్యూర్-ప్యూర్-రేర్‌తో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి** అభివృద్ధి ఒకే నగరానికి పరిమితం కాకూడదని, అదే సమయంలో గ్రామీణ ప్రాంతాలు వెనుకబడకూడదన్న లక్ష్యంతో తెలంగాణ క్యూర్-ప్యూర్-రేర్ పేరుతో మూడు పరస్పర అనుసంధానిత ఆర్థిక ప్రాంతాలతో ప్రత్యేక అభివృద్ధి నమూనాను రూపొందించిందని డిప్యూటీ సీఎం తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ కేంద్రంగా క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్)ను అత్యున్నత సేవలు, కృత్రిమ మేధ, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, ఫిన్‌టెక్, లైఫ్ సైన్సెస్, నాలెడ్జ్ ఆధారిత పరిశ్రమలకు కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. ప్రధాన రవాణా మార్గాల వెంట ప్యూర్ (పెరీ-అర్బన్ రీజియన్)ను పారిశ్రామిక, తయారీ రంగాలకు కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. రేర్ (రూరల్ అగ్రికల్చరల్ అండ్ రీసోర్సెస్ ఎకానమి) ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు తీసుకురానున్నట్టు చెప్పారు. **30 వేల ఎకరాలకు పైగా భారత్ ఫ్యూచర్ సిటీ** దేశంలో భవిష్యత్ నగరాలకు నమూనాగా 30 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నట్టు భట్టి విక్రమార్క తెలిపారు. దేశంలో తొలి నెట్-జీరో, ఏఐ ఆధారిత గ్రీన్ మెగాసిటీగా దీన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలు, అంతర్జాతీయ పరిశోధనా కేంద్రాలు, క్లీన్ టెక్నాలజీ పార్కులు, పర్యావరణహిత నివాస ప్రాంతాలు ఇందులో భాగంగా ఉంటాయని వివరించారు. **3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం** తెలంగాణ బలమైన ఆర్థిక పునాదులతో తదుపరి దశ వృద్ధికి సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. 2025-26లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) రూ. 17.82 లక్షల కోట్లకు చేరిందని, ప్రస్తుత ధరల ప్రకారం 10.7 శాతం వృద్ధి నమోదైందన్నారు. స్థిర ధరల ప్రకారం వాస్తవ జీఎస్‌డీపీ వృద్ధి 8.5 శాతంగా అంచనా వేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931కు చేరిందని, ఇది జాతీయ సగటు రూ. 2,19,575తో పోలిస్తే దాదాపు రెండింతలని వివరించారు. సేవల రంగం 13.5 శాతం, ద్వితీయ రంగం 9.4 శాతం వృద్ధి సాధించాయని తెలిపారు. ప్రస్తుత వృద్ధి పథంలో కొనసాగితే 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థ 1.21 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా ఉందని, అయితే 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని సంకల్పించామని ప్రకటించారు. తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను ప్రస్తుతం ఉన్న దాదాపు 5 శాతం నుంచి 10 శాతానికి పెంచాలన్నది లక్ష్యమని తెలిపారు. **యువతే తెలంగాణకు అతిపెద్ద బలం** 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు మౌలిక వసతులు, పెట్టుబడులతో పాటు మానవ వనరులే అసలైన పునాది అని డిప్యూటీ సీఎం అన్నారు. తెలంగాణ యువతే రాష్ట్రానికి అతిపెద్ద బలమని వివరించారు. ఉన్నత విద్యకు, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు ప్రముఖ అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆర్థిక వృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరాలని, సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యం రాష్ట్రానికే పరిమితమైనది కాదని, 2047 నాటికి సుసంపన్నమైన, స్వావలంబనతో కూడిన వికసిత్ భారత్ నిర్మాణానికి తెలంగాణ అందించే భాగస్వామ్యమని డిప్యూటీ సీఎం

# హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు శ్రీరామరక్ష

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 :** పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ పార్టీకి శ్రీరామరక్ష అని పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలో ఈ ఫిరాయింపుల కల్చర్ ను తెచ్చిన కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీలకు ఇది చెంపపెట్టు అని విమర్శించారు. మూడు రోజులుగా ఢిల్లీలో ఉన్న మహేశ్ కుమార్ గౌడ్... శనివారం తెలంగాణ భవన్ లోని శబరీ బ్లాక్ లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. 2014, 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వమే పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందని గుర్తు చేశారు. టీడీపీలో గెలిచిన తలసాని, కాంగ్రెస్ నుంచి గెలిచిన సబిత, ఇతర పార్టీల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలకు నేరుగా మంత్రి పదవులు ఇచ్చిన చరిత్ర బీఆర్ఎస్ ది అని మండిపడ్డారు. అలాగే కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లోకి తీసుకుని ప్రతిపక్షానికి శాసనసభలో సరైన హోదా లేకుండా చేశారన్నారు. ఇప్పుడు పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీ ఫిరాయింపుల విషయంలోనూ అప్పటి ప్రభుత్వం అనుసరించిన విధానాలను రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదన్నారు. **ప్రభుత్వాన్ని కూల్చుతామన్నారు...** పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే ముందు తమ ప్రభుత్వ



హయాంలో జరిగిన పరిణామాలను గుర్తు చేసుకోవాలని బీఆర్ఎస్ నేతలకు పీసీసీ చీఫ్ హితవు పలికారు. ప్రధానంగా ఆనాటి సీఎం కేసీఆర్ అనేక నిబంధనలు ఉల్లంఘించి, ఫిరాయింపులను ప్రోత్సహించారని మండిపడ్డారు. **బీజేపిది పార్టీలను చీల్చే సంస్కృతి...** దేశవ్యాప్తంగా పార్టీ ఫిరాయింపులను బీజేపీ కూడా ప్రోత్సహించిందని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఫిరాయింపులతో ఆగకుండా... పార్టీలను చీల్చి లబ్ధి పొందే సంస్కృతికి తెరలేపిందని తీవ్రంగా మండిపడ్డారు. టీ-ఎంసీ, శివసేన, ఎన్‌సీపీ వంటి పార్టీలను చీల్చి పలు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీశారని ఆరోపించారు. పార్టీ ఫిరాయింపులపై దేశవ్యాప్తంగా ఒకే విధమైన రాజకీయ ప్రమాణాలు ఉండాలని అన్నారు. కాగా... ఎవరికి మంత్రి పదవులు ఇవ్వాలి, ఎప్పుడు ఇవ్వాలనే నిర్ణయం పూర్తిగా సీఎం రేవంత్‌రెడ్డిదేనన్నారు. పార్టీ, ప్రభుత్వానికి సంబంధించిన అంశాల్లో అధిష్టానం, ముఖ్యమంత్రి నిర్ణయాలకు అనుగుణంగానే ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు.

# వరంగల్ విమానాశ్రయానికి పేరును సూచించండి :సీఎం

(మొదటి పేజీ తరువాయి)

వారి కుటుంబ ఇష్టాలను తీర్చుకోవడంలోనే శ్రద్ధ చూపించారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో కల నిజం కాబోతుందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మామునూరు ఎయిర్ పోర్ట్ భూసే కరణ కోసం రూ. 295 కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. అవసరమైన భూమిని పూర్తిగా సేకరించి ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించినట్టు తెలిపారు. అది ఒక విమానా శ్రయం మాత్రమే కాదనీ, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, పెట్టుబడులకు ప్రవేశ ద్వారమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. మామునూరు ఎయిర్ పోర్ట్ నుంచి విమానాలు గాలిలో ఎగరడం అంటే అది అభివృద్ధి చెందుతున్న, అనుసంధానమవుతున్న తెలంగాణకు సంకేతమని తెలిపారు. వరంగల్ లో రాబోయే నూతన విమానాశ్రయానికి పేరు పెట్టేందుకు సూచనలు ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు.

# మరిన్ని రంగుల్లో యూనిఫామ్స్ ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

సైదులు, సంతోష్, సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్ పిల్లలకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన వస్తువుల పంపిణీ వివరాలను అధికారులు సీఎంకు నివేదించారు. విద్యార్థులకు ఒక జత యూనిఫాం పంపిణీ పూర్తయిందనీ, రెండో జత యూనిఫాంను నెలాఖరులోగా అందజేస్తామని తెలిపారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందజేశామన్నారు. విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు పంపిణీ పూర్తయిందని చెప్పారు. ప్రభుత్వ వసతిగృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలోని విద్యార్థులందరికీ ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, స్పూన్లు, కప్పులు, కార్పెట్లు, బెడ్ షీట్లు, టవళ్లు పంపిణీ పూర్తయిందని అధికారులు సీఎంకు వివరించారు. ఆయా వివరాల పట్ల ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తంచేశారు. వచ్చే ఏడాది పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాం, ఇతర సామగ్రి విద్యార్థులకు అందేలా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు అదనంగా 10 శాతం విద్యార్థులు పాఠశాలల్లో చేరే అవకాశం ఉన్నందున, అందుకు తగినట్లు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు వచ్చిన తక్షణం ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది అనుకున్న లక్ష్యాల ప్రకారం పనిచేసిన అధికారుల్ని అభినందించారు.

# ఎల్‌నినో రాష్ట్రంలోనే ఉందా!... ఆంధ్రా, కర్నాటకలో లేదా.?

**పెబ్బేరు, సెప్టెంబర్ 19 :** 'ఎల్‌నినో ప్రభావం తెలంగాణ రాష్ట్రంలోనే ఉందా! ఆంధ్రా, కర్నాటక రాష్ట్రాలలో లేదా.? రైతులకు నీళ్లు ఇవ్వలేని రేవంత్ రెడ్డిది.. అసమర్థ పాలన. ఎకరం పొలం ఎండినా సీఎందే బాధ్యత. ఇది ప్రకృతి తెచ్చినది కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు అన్నారు. శనివారం కొల్లాపూర్ పర్యటనలో భాగంగా వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలో పర్యటించిన కేటీఆర్ జూరాల కాల్వలల్లోని నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మెన్ కరుణశ్రీ సాయి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డితో కలిసి మాట్లాడారు. ఎల్ నినో పేరుతో ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని, పంటలకు సాగునీరు ఇవ్వకపోవడమే కాకుండా విద్యుత్ కోతలతోనూ పంటలు ఎండిపోతున్నాయన్నారు. జూరాల డ్యామ్ లో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్ కు ఎగువ ఉన్న పోతిరెడ్డిపాడు వెలిగొండ ప్రాజెక్టులకు 100 టీఎంసీల నీరు విడుదల చేయడం సిగ్గుచేటు అని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం సాగుకు కృష్ణా జలాలను పాలమూరు రైతులకు ఇవ్వలేకపోతుందన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందని, అక్కడి ప్రభుత్వంతో మాట్లాడి నీటిని జూరాలకు తరలించవచ్చు కదా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఆల్మట్టి నారాయణపూర్ ప్రాజెక్టుల వద్ద ఐదు మీటర్ల ఎత్తు పెంచడానికి కర్నాటక ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల అనేక రిజర్వాయర్లకు సాగునీరు అందించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు ను రూ. 84 వేల కోట్లతో 40 టీఎంసీల నీటి కోసం కేసీఆర్ నిర్మిస్తే దానికి రేవంత్‌రెడ్డి కాకిగోల చేస్తున్నారని విమర్శించారు. కింద ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సాగునీరు పోతుంది, కానీ పైన ఉన్న తెలంగాణకు నీళ్లు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఇది కేవలం గురువు మీద ఉన్న ప్రేమతోనే రేవంత్ రెడ్డి ప్రశ్నించడం లేదని విమర్శించారు. అత్యల్పంగా కృష్ణా నీటిని వినియోగించుకున్న ప్రభుత్వం రేవంత్ రెడ్డిదే అని అన్నారు. కల్వకుర్తి లిఫ్టులను కొనసాగించకుండా రైతులకు సాగునీరు అందించకుండా ప్రభుత్వమే ఇబ్బందులు పెడుతుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు 24 గంటలు కరెంటు సరఫరా చేస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం 6 గంటలు కూడా సరఫరా చేయడం లేదన్నారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుపై ప్రభుత్వానికి హైకోర్టు తీర్పు చెంపపెట్టు అన్నారు. తొలి వికెట్ దానం నాగేందర్ అని, మిగతా వారిని కూడా తొందర్లోనే పడగొడతామన్నారు. పార్టీ ఫిరాయించిన వారందరూ రాజీనామా చేసి గెలవాలన్నారు. మళ్లీ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం వస్తుందని, ప్రజల కష్టాలన్నీ తీరుస్తుందని తెలిపారు. సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, పెబ్బేరు మండల పట్టణ పార్టీ అధ్యక్షులు వనం రాములు, దిలీప్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు కరుణశ్రీ, హరి శంకర్ నాయుడు, సౌజన్య, మన్యం, పార్టీ నాయకులు కర్రే స్వామి, పెద్దింటి వెంకటేష్, సాయి, విశ్వరూపం తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో మరో 5 రోజుల వరకు భారీ వర్షాలు..



**హైదరాబాద్: సెప్టెంబర్ 19 :** వర్షాల కోసం ఎదురుచూస్తున్న రాష్ట్ర ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చల్లటి కబురు అందించింది. రాష్ట్రంలోఈ నెల 24 వరకు పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ హైదరాబాద్ కేంద్రం తెలిపింది. ఇది క్రమంగా బలపడి దక్షిణ ఒడిశా- ఉత్తర ఆంధ్ర తీరాల వైపు కదులుతుందని, దీని ప్రభావంతో తెలంగాణలో వర్షాలు పుంజుకుంటాయని అంచనా వేసింది. ఈ వానాకాలంలో ఇప్పటివరకు రాష్ట్రంలో సాధారణం కన్నా 19 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఈ కొత్త అల్పపీడనంతో ఆ లోటు కొంతవరకు భర్తీ అయ్యే అవకాశం కనిపిస్తోంది. ఆదివారం, సోమవారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, సిద్దిపేట, మెదక్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. తర్వాతి రోజుల్లో ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్ సహా మరిన్ని జిల్లాలకు ఈ హెచ్చరికలు వర్తించనున్నాయి. హైదరాబాద్ నగరంలోనూ ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. రుతుపవనాల తిరోగమనం ఆలస్యమయ్యే సూచనలు ఉన్నాయని, అక్టోబర్ రెండో వారం వరకు వర్షాలు కొనసాగవచ్చని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

# గణనాథుడికి మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు

**-- వినాయక మండపాల వద్ద భక్తులతో కలిసి అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్**



**బాలానగర్ సెప్టెంబర్ 20 ( పీపుల్స్ న్యూస్)** వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న నేపథ్యంలో బాలానగర్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన గణనాథుడి విగ్రహాలను బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఫిరోజ్‌గూడ, సత్తిరెడ్డి కాలనీ, గీతానగర్, వాణి సొసైటీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.అనంతరం ఆయా వినాయక మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో ఆవుల రవీందర్‌రెడ్డి పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. భక్తులతో కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, ఉత్సవాల సందర్భంగా ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావం పెంపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రజలను ఒకచోట చేర్చి ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు వేదికగా నిలుస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు. వివిధ వినాయక మండపాల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వినాయక మండపాల నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండపాల వద్ద భక్తి గీతాలు, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలతో పండుగ వాతావరణం నెలకొంది.

# ఫతేనగర్‌లో ఘనంగా వినాయక పూజలు

**-- పైప్‌లైన్ రోడ్డులోని టీమ్ ఐ బాయ్స్ వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు -- భక్తులకు అన్నదానం**



**బాలానగర్ సెప్టెంబర్ 20 ( పీపుల్స్ న్యూస్)** ఫతేనగర్ డివిజన్ పరిధిలోని పైప్‌లైన్ రోడ్డులో టీమ్ ఐ బాయ్స్ వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంటెస్టెడ్ కార్పొరేటర్ కంచి మహేందర్ యాదవ్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణనాథుడిని దర్శించుకుని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా వినాయక అసోసియేషన్ సభ్యులు మహేష్ యాదవ్, అమన్, మధుకర్ యాదవ్, మానేపల్లి రాము, మాజీ గ్రేటర్ హైదరాబాద్ జెంట్స్ సెక్రటరీ అశోక్ చారి, రాము ముదిరాజ్, మానేపల్లి సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వినాయక చవితి వేడుకల్లో భాగంగా భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణంతో పాటు అన్నదానం నిర్వహించడం పట్ల స్థానికులు వినాయక అసోసియేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమం సందర్భంగా మండపం పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి

# కాళభైరవ గణేశుడి మండపంలో ప్రత్యేక పూజలు

**- గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రముఖులు**



**బాలానగర్ సెప్టెంబర్ 20 ( పీపుల్స్ న్యూస్)** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈరోజు కాళభైరవ గణేశుడి మండపంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు పలువురు ప్రముఖులు హాజరై గణనాథుడిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన పూజల్లో శ్రీనివాస రాజు, సురేందర్ యాదవ్, రామ్‌గోపాల్, మురళి, నాగేశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం నిర్వాహకులు, భక్తులతో కలిసి ఉత్సవాల ఏర్పాట్లు, భక్తులకు అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. గణనాథుడి మండపం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. దీంతో మండపం పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# గంగారం సెక్టార్లో పోషణ మాసం కార్యక్రమాలు



**ఖమ్మం సెప్టెంబర్ 19**సత్తుపల్లి మండల పరిధిలోని గంగారం సెక్టార్ పరిధిలో సత్యనారాయణపురం అంగన్వాడీ కేంద్రంలో గ్రామ సర్పంచ్ దారావత్ సునీత ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మావతి పిల్లలకు అక్షరాబ్యాసాలు చేయించి, పోషకహార ప్రదర్శన నిర్వహించి, పోషక విలువల గురించి తెలిపారు. ఈ కార్యక్రమం లో సూపర్వైజర్ పద్మావతి గ్రామ పెద్దలు కృష్ణకుమార్ అంగన్వాడీ టీచర్స్ త్రివేణి, యశోద, కుమారి తల్లులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# 18 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం







**చిట్యాల, ప్రతినిధి సెప్టెంబర్ 19( పీపుల్స్ న్యూస్)** గురుపూజోత్సవం సందర్భంగా చిట్యాల మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 18 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు శనివారం అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల సేవలను అభినందించారు.విద్యార్థుల విద్యాభివృద్ధికి, నాణ్యమైన విద్యాబోధనకు విశేష కృషి చేస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి అవార్డులు అందజేశారు. అవార్డు పొందిన ప్రతి ఉపాధ్యాయుడిని శాలువా, మెమోంటో, సర్టిఫికెట్లతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా ఎంఈఓ రఘుపతి మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను ప్రోత్సహించడం ద్వారా విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. కార్యక్రమంలో చల్లగరిగ కాంప్లెక్స్ హెచ్ ఎం శ్రీమతి ఝాన్సీ, జూకల్ గెజిటెడ్ హెచ్‌ఎం గిరగాని కృష్ణ, సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ గోల్కొండ బిక్షపతి, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మైనంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉత్సాహంగా తల్లిదండ్రుల సమావేశం





**దేవరకొండ 19సెప్టెంబర్ :** స్థానిక ప్రాథమిక పాఠశాలలో నేడు విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి విద్యార్థిని తండ్రి, స్థానిక సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమన్వయం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు.?ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, జగదీష్, మాజీ ఉప సర్పంచ్ వెంకట్, ఏఎన్‌ఎం విద్యావతి తదితరులు పాల్గొన్నారు. పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు మరియు రాబోయే విద్యా ప్రణాళికల గురించి సమావేశంలో చర్చించారు.

# ఎమ్మెల్సీ విఠల్‌కు పేపర్ మిల్లు కార్మికుల సన్మానం

**- కార్మిక సమస్యల పరిష్కారానికి చూపుతున్న చొరవపై అభినందనలు**



**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 19** పేపర్ మిల్లు కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్‌ను శనివారం స్థానిక పేపర్ మిల్లు కార్మిక సంఘాల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్మిక సంఘాల నాయకులు ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు.ఇటీవల హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామితో పేపర్ మిల్లుకు చెందిన పది కార్మిక సంఘాల ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేయడంలో ఎమ్మెల్సీ విఠల్ చొరవ చూపారని నాయకులు పేర్కొన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే రోజుల్లోనూ కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు కర్మాగార పురోగతికి సంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల ఫోరం ప్రతినిధులు, పేపర్ మిల్లు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గణనాథుని సన్నిధిలో ఘనంగా అన్నదానం

**- సుమారు వెయ్యి మంది భక్తులకు భోజన ప్రసాదం**



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 19:**
 వినాయక చవితి సందర్భంగా రుడా మేస్త్రినగర్, శ్రీరామ్‌నగర్ (ఏ)లోని శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ పోచమ్మ నాగదేవత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథునికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త నేమూరి నరేష్‌గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించి సుమారు వెయ్యి మంది భక్తులకు భోజన ప్రసాదం అందించారు.
ఈ సందర్భంగా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు ఆశీస్సులు పొందారు. బస్తీ, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.
కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నేమూరి నరేష్‌గౌడ్, సింగారం మల్లేష్, సురిగి లక్ష్మణ్‌గౌడ్, బూసిరెడ్డి మల్లారెడ్డి, బద్రి వెంకట రమణయ్య, కోలా శ్రీనివాస్‌గౌడ్, బండ సిద్ధులు, సిద్ధం సంతోష్, బుట్ట బాబురావు, రాజేష్ కన్నా, బాలరాజ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్బీఐ సౌజన్యంతో బాసర క్షేత్రంలో ఉచిత బస్సు.. పూజలు చేసి ప్రారంభించిన ఈవో అంజనీ దేవి



**ముధోల్ (బాసర), సెప్టెంబరు 19:**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం నూతనంగా ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రాదీ×) శాఖ సామాజిక బాధ్యతగా రూ. 25 లక్షల వ్యయంతో ఈ ఉచిత బస్సును సమకూర్చింది. శనివారం ఆలయ ప్రాంగణంలో ఈ ఉచిత బస్సు సర్వీసును ఆలయ ఈవో అంజనీ దేవి, ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్ జి. అశోక్ కుమార్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ రోజు (సెప్టెంబరు 19) నుంచే ఈ ఉచిత రవాణా సేవలు భక్తులకు అందుబాటులోకి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ బస్సు ప్రతిరోజూ ఆలయం నుండి గోదావరి నది మరియు రైల్వే స్టేషన్ వరకు భక్తులను ఉచితంగా చేరవేస్తుందని అధికారులు తెలిపారు. రైళ్లలో వచ్చే భక్తులకు మరియు పవిత్ర గోదావరి నది స్నానాలకు వెళ్లేవారికి ఈ ఉచిత బస్సు ప్రయాణం ఎంతగానో ఉపయోగపడుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బెల్తారోడాలో అధిక ధరలకు కూల్ డ్రింక్స్ విక్రయం: బేకరీ యజమానిపై కేసు



**ముధోల్ (తానూర్),సెప్టెంబర్19**
నిర్మల్ జిల్లా తానూర్ మండలం బెల్తారోడా గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఒక బేకరీ నిర్వాహకుడిపై అధికారులు కేసు నమోదు చేశారు. గ్రామంలోని సదరు మిఠాయి భండార్, బేకరీలో కూల్ డ్రింక్స్ మరియు ఇతర బేకరీ పదార్థాలను ఎమ్మార్పీ (వీ=ా) ధరల కంటే చాలా ఎక్కువ రేట్లకు విక్రయిస్తున్నట్లు స్థానిక గ్రామస్తుల నుండి అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ సమాచారంతో స్పందించిన తూనికలు, కొలతల శాఖ అధికారులు శుక్రవారం నాడు సదరు దుకాణంపై ఆకస్మికంగా దాడులు (తనిఖీలు)నిర్వహించారు. ఈ తనిఖీలలో నిబంధనల ఉల్లంఘన నిజమేనని తేలడంతో సదరు బేకరీ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా అధికారి పి. శంకర్ అధికారికంగా వెల్లడించారు. వినియోగదారులను మోసం చేస్తూ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

# ఏఐకేఎంఎస్ జాతీయ 4వ మహాసభలను జయప్రదం చేయాలి

**- పోస్టర్ ఆవిష్కరణలో ఏఐకేఎంఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గుండేటి మల్లేశం**



**రామగుండం (జ్యోతినగర్) సెప్టెంబర్ 19 ,(పీపుల్స్ న్యూస్)**
అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జాతీయ 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గుండేటి మల్లేశం పిలుపునిచ్చారు. శనివారం ఎన్టీపీసీ జ్యోతినగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయం ఎదుట ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభల వాల్ పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుండేటి మల్లేశం మాట్లాడుతూ.. దేశానికి అన్నం పెట్టే రైతాంగం పాలకుల తప్పుడు విధానాల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఐక్యంగా నిలిచి పాలకుల వ్యతిరేక విధానాలపై సమరశీల ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించి, భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందించేందుకు ఈ జాతీయ 4వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, రైతు కూలీలు అధిక సంఖ్యలో హాజరై ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిలుక శంకర్, ఏఐకేఎంఎస్ పెద్దపల్లి జిల్లా నాయకులు ఐ. రాజేశం, గుండు రాజయ్య, మధుకర్, సింహాచలం, కందునూరి సత్తయ్య, పోతుల కొమరయ్య, శ్రీనివాస్, పులిశెట్టి వెంకన్న, పులిశెట్టి అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా?

**- హఫీజ్‌పేట్ ఘటనపై మాజీ కార్పొరేటర్ బొబ్బా నవతారెడ్డి ఆగ్రహం**
**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**






**శేర్లింగంపల్లి: సెప్టెంబర్ 19 (పీపుల్స్ న్యూస్)**
మహిళలకు రక్షణ కల్పించాల్సిన భద్రతా సిబ్బందే ఓ మహిళపై దాడికి పాల్పడినట్లు వెలువడిన దృశ్యాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని మాజీ కార్పొరేటర్ బొబ్బా నవతారెడ్డి అన్నారు. హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ సమీపంలో మహిళపై హోంగార్డు దాడికి పాల్పడినట్లు పేర్కొంటున్న ఘటనను ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై కలిదింది రోజా, మమతలతో కలిసి నవతారెడ్డి స్పందించారు.

**మహిళల భద్రతపై ప్రభుత్వానికి ప్రశ్నలు**
మహిళలకు రక్షణ కల్పించాల్సిన సిబ్బంది వారి పట్ల హుందాగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంటుందని నవతారెడ్డి అన్నారు. మహిళను జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లినట్లు కనిపిస్తున్న దృశ్యాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెబుతు న్నప్పటికీ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**మాటలు కాదు.. చేతల్లో భరోసా కల్పించాలి**
రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ప్రధాన రహదారులు తదితర ప్రాంతాల్లో మహిళలు నిర్భయంగా తిరిగేలా భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. హఫీజ్‌పేట్ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు వెలికితీసి, అసలు ఏం జరిగిందనే విషయంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**
ఘటనకు కారణాలు ఏవైనా ఒక మహిళపై భౌతిక దాడి జరిగినట్లు ఆరోపణలు వస్తే దానిపై నిష్పక్షపాతంగా విచారణ జరపాల్సిన అవసరం ఉందని నవతారెడ్డి అన్నారు. ఆరోపణలు నిజమని విచారణలో తేలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భద్రతా సిబ్బందికి ప్రజలతో, ముఖ్యంగా మహిళలతో సంయమనంతో వ్యవహరించేలా శిక్షణ ఇవ్వాలని, విధి నిర్వహణలో బాధ్యతాయుత ప్రవర్తనపై ఉన్నతాధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని బొబ్బా నవతారెడ్డి కోరారు.

# గణేష్ మండపంలో భద్రతా ఏర్పాట్లపై పోలీసుల సూచనలు





**హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 19 (పీపుల్స్ న్యూస్)**
వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో గణేష్ మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లను పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా సనత్‌నగర్ బస్‌స్టాండ్ సమీపంలోని భగత్‌సింగ్ పార్క్ గణేష్ మండపాన్ని జూబ్లీహిల్స్ జోన్ డీసీపీ, ఎస్‌ఆర్‌నగర్ ఏసీపీ, సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. మండప నిర్వాహకులతో మాట్లాడిన పోలీసు అధికారులు ఉత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ముఖ్యంగా విద్యుత్ కనెక్షన్లు, అగ్ని ప్రమాదాల నివారణ, మండపం వద్ద భక్తుల భద్రత, రద్దీ నియంత్రణ వంటి అంశాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా గణేష్ నిమజ్జనం సమయంలో కూడా భద్రతా నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని మండప నిర్వాహకులకు తెలిపారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ అన్ని చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు.

# నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు.

**భద్రాచలం,సెప్టెంబరు.19,**
వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 24, 25, 26 తేదీల్లో జరగనున్న నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో శనివారం భద్రాచలంలోని గోదావరి తీరంలోని ఘాట్‌లను సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. నిమజ్జన ప్రాంతాల్లో లాంచీలు, బారికేడింగ్, విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాల నిఘా, తాగునీటి సౌకర్యం, వైద్య బృందాలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. నదీ తీరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రత, రక్షణ చర్యలను పటిష్ఠంగా చేపట్టాలని సబ్ కలెక్టర్, డీఎస్పీ అరుణ్‌కుమార్‌కు సూచించారు. పోలీసు, రెవెన్యూ, రవాణా, వైద్యారోగ్య, అగ్నిమాపక, అటవీ, నీటిపారుదల, పంచాయతీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. భక్తులు కేటాయించిన ప్రదేశాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలని, వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ ప్రాంతాల్లోనే నిలిపివేయాలని సూచించారు. ఘాట్‌ల వద్ద చిన్నారులు, వృద్ధులు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని, మద్యం సేవించి నిమజ్జన కార్యక్రమాలకు రావద్దని అధికారులు సూచించారు. మండపాల నిర్వాహకులు, భక్తులు ఊరేగింపుల్లో క్రమశిక్షణ పాటించాలని, అధిక శబ్దంతో డీజేలు వినియోగించకుండా పోలీసు, మున్సిపల్ శాఖల సూచనలను పాటించాలని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ కోరారు. సిబ్బంది పాల్గొన్నారు.

# పశువుల దొంగతనాలు.. మొబైల్ షాపుల్లో చోరీలు

- అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్
- తెలంగాణ, మధ్యప్రదేశ్‌లో 17 కేసులు ఛేదన
- చోరీ మొబైళ్లను ముంబయి మీదుగా బంగ్లాదేశ్‌కు తరలిస్తున్న నెట్‌వర్క్ వెలుగులోకి
- 9 మంది అరెస్ట్.. ముగ్గురు పరారీ
- రూ.22 లక్షల నగదు, 15 మొబైల్ ఫోన్లు, 3 కార్లు స్వాధీనం












**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబరు 19 (పీపుల్స్ న్యూస్)** పశువులకు మత్తు ఇంజెక్షన్లు ఇచ్చి అపహరించడంతో పాటు, అర్ధరాత్రి వేళల్లో మొబైల్ దుకాణాల షట్టర్లు లేపి చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్, ఖమ్మం పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. విచారణలో చోరీ చేసిన మొబైల్ ఫోన్లను ముంబయి మీదుగా బంగ్లాదేశ్‌కు తరలిస్తున్న అంతర్జాతీయ నెట్‌వర్క్ వివరాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం.. నిందితులు తెలంగాణలో 13 పశువుల దొంగతనాలు, ఖమ్మంలో ఒక మొబైల్ షాపు చోరీ, మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో రెండు మొబైల్ షాపుల్లో చోరీలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో మొత్తం 17 కేసులను ఛేదించినట్లు పోలీసులు వెల్లడించారు.

### పశువులకు మత్తు ఇంజెక్షన్లు

రంజాన్, బక్రీద్ పండుగల సమయంలో పశువులకు డిమాండ్ ఎక్కువగా ఉండటాన్ని నిందితులు అనుకూలంగా మార్చుకున్నట్లు పోలీసులు తెలిపారు. అర్ధరాత్రి వేళల్లో నిర్మానుష్య ప్రాంతాల్లోని పశువుల పాకలను గుర్తించి, పశువులకు జైలాజిన్ (శఎశ్రీఖఓఱఅవ) మత్తు ఇంజెక్షన్లు ఇచ్చి వాహనాల్లో ఎక్కించుకుని అపహరించేవారని పేర్కొన్నారు. అనంతరం వాటిని సంతల్లో తక్కువ ధరకు విక్రయించేవారని తెలిపారు.ఈ వ్యవహారంలో మహ్మద్ తబ్రేజ్, మహ్మద్ రఫీక్ ప్రధాన నిందితులుగా ఉండగా, మహ్మద్ జుబేర్ అక్తర్, మహ్మద్ నవీద్ తదితరులు కొన్ని నేరాల్లో పాల్గొన్నట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. జైలాజిన్ ఇంజెక్షన్లను పి. సాయిరెడ్డి సరఫరా చేసినట్లు గుర్తించినట్లు వెల్లడించారు.

### పశువుల నుంచి మొబైల్ చోరీలకు

రంజాన్, బక్రీద్ అనంతరం పశువులకు డిమాండ్ తగ్గడంతో ముఠా తిరిగి మొబైల్ దుకాణాల షట్టర్లు లేపి చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. గతంలో పరిచయం ఉన్న ఫరహాన్ షేక్‌ను సంప్రదించిన తబ్రేజ్.. మొబైల్ దుకాణాలను లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించారు.2026 జూన్ 11న ఖమ్మంలోని 'సోనోవిజన్' మొబైల్ షాపు షట్టర్ లేపి చోరీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. చోరీ చేసిన మొబైల్ ఫోన్లను ముంబయిలోని మధ్యవర్తుల ద్వారా విక్రయించినట్లు పేర్కొన్నారు. అనంతరం నిందితులు మధ్యప్రదేశ్‌కు వెళ్లి ఉజ్జయినిలో రెండు మొబైల్ దుకాణాల్లో చోరీలకు పాల్పడ్డారని వెల్లడించారు.

### బంగ్లాదేశ్ వరకు విస్తరించిన నెట్‌వర్క్

చోరీ మొబైళ్లను కొనుగోలు చేస్తున్న ముంబయికి చెందిన మహ్మద్ జాహెద్ ఖాన్ అలియాస్ రాజా భాయ్ ద్వారా నెట్‌వర్క్ విస్తరించినట్లు పోలీసులు తెలిపారు. జాహెద్ ఖాన్ చోరీ మొబైళ్లను ముంబయిలో సేకరించి, బంగ్లాదేశ్‌లోని ఢాకాకు చెందిన ఖాసిమ్ ద్వారా అక్కడికి తరలించేవాడని విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు.ముంబయి నుంచి ఫోన్లను పార్శిల్ రూపంలో కోల్‌కతాకు తరలించి, అక్కడి నుంచి జలమార్గాల ద్వారా బంగ్లాదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో హవాలా మార్గాల్లో ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు కూడా గుర్తించామని, ఆ కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు.

### విజయవాడ, గుజరాత్‌లోనూ యత్నాలు

ఖమ్మం ఘటనకు ముందు నిందితులు విజయవాడలోని 'బిగ్-సి' దుకాణంలో చోరీకి యత్నించినా విఫలమైనట్లు పోలీసులు తెలిపారు. అనంతరం గుజరాత్‌లో మరో చోరీకి రెక్కీ నిర్వహించిన సమయంలో పోలీసుల పెట్రోలింగ్ వాహనాన్ని గమనించి తప్పించుకునే క్రమంలో వారి కారు ప్రమాదానికి గురైనట్లు పేర్కొన్నారు. వాహనంలో నకిలీ నంబర్ ప్లేట్లు, షట్టర్లు లేపేందుకు ఉపయోగించే ఇనుప రాడ్లు లభించినట్లు తెలిపారు.

### నేరానికి ముందే పట్టుబడిన ముఠా

మరిన్ని చోరీలకు సిద్ధమవుతూ 2026 ఆగస్టు 17న హైదరాబాద్‌లో కొత్త వాహనంతో తిరుగుతున్న నిందితులను పోలీసులు నేరం జరగకముందే అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో మొత్తం తొమ్మిది మందిని అరెస్ట్ చేయగా, అబూ అలియాస్ అఫ్జల్, కాలు, ఢాకాకు చెందిన ఖాసిమ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

### రూ.22 లక్షల సొత్తు స్వాధీనం

నిందితుల నుంచి రూ.22 లక్షల నగదు, 15 మొబైల్ ఫోన్లు, మూడు కార్లు, ఒక నంబర్ ప్లేట్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. చోరీ సొత్తు విక్రయించిన నగదులో కొంత భాగాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఐపీఎస్ పర్యవేక్షణలో జూబ్లీహిల్స్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్. యాదేందర్, ఎస్సైలు డి. రవిరాజ్, జి. సందీప్ రెడ్డి, సిబ్బంది, ఖమ్మం పోలీసులు సమన్వయంతో ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

# గంగారం సెక్టార్లో పోషణ మాసం కార్యక్రమాలు



**ఖమ్మం సెప్టెంబర్ 19 (పోలీస్ నిఘా )** సత్తుపల్లి మండల పరిధిలోని గంగారం సెక్టార్ పరిధిలో సత్యనారాయణపురం అంగన్వాడీ కేంద్రంలో గ్రామ సర్పంచ్ దారావత్ సునీత ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మావతి పిల్లలకు అక్షరాబ్యాసాలు చేయించి, పోషకహార ప్రదర్శన నిర్వహించి, పోషక విలువల గురించి తెలిపారు. ఈ కార్యక్రమం లో సూపర్వైజర్ పద్మావతి గ్రామ పెద్దలు కృష్ణకుమార్ అంగన్వాడీ టీచర్స్ త్రివేణి, యశోద, కుమారి తల్లులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మైనంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉత్సాహంగా తల్లిదండ్రుల సమావేశం





**దేవరకొండ 19సెప్టెంబర్** స్థానిక ప్రాథమిక పాఠశాలలో నేడు విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి విద్యార్థిని తండ్రి, స్థానిక సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమన్వయం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు.?ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, జగదీష్, మాజీ ఉప సర్పంచ్ వెంకట్, ఏఎన్ఎం విద్యావతి తదితరులు పాల్గొన్నారు. పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు మరియు రాబోయే విద్యా ప్రణాళికల గురించి సమావేశంలో చర్చించారు.

# రీ సర్వే పనులను వేగవంతం చేయాలి



**యాదగిరిగుట్ట,సెప్టెంబర్ 19:** రీ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు అధికారులను ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.శనివారం రాజాపేట మండలం బసంతాపురం గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనులను భాస్కర్ రావు పరిశీలించారు. సర్వే పురోగతిని తెలుసుకుని సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం రైతులతో మాట్లాడి రీ సర్వేలో చురుగ్గా పాల్గొని సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు.అనంతరం రాజాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తహసీల్దార్‌తో కలిసి తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి సిబ్బంది హాజరు వివరాలను తెలుసుకున్నారు.ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలు, మందుల లభ్యతపై ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికిరణ్ కుమార్, సర్వేయర్ సత్యం, మండల గిర్ధావర్ పల్లెపాటి నరసింహులు, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మానవ హక్కుల సంస్థ జిల్లా చైర్మన్‌గా సయ్యద్ మతీన్

- ప్రజా సమస్యలు, మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయనున్నట్లు వెల్లడి






**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 19 (పీపుల్స్ న్యూస్)** ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ సంస్థ జిల్లా చైర్మన్‌గా సయ్యద్ మతీన్ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ అధ్యక్షుడు, వ్యవస్థాపకుడు విపిన్ చౌహాన్ శనివారం నియామక పత్రాన్ని జారీ చేశారు. సంస్థలో జిల్లా స్థాయిలో బాధ్యతలు నిర్వర్తిస్తూ మానవ హక్కుల పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు సయ్యద్ మతీన్‌ను నియమించినట్లు నియామక పత్రంలో పేర్కొన్నారు.సమాజంలో మానవ హక్కులపై అవగాహన పెంపొందించడం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, అవసరమైన సందర్భాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా సంస్థ కార్యకలాపాలను నిర్వహించడం వంటి అంశాలపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు.సంస్థ నిర్వహించే వివిధ కార్యక్రమాలు, సమావేశాలు, అవగాహన కార్యక్రమాల్లో జిల్లా స్థాయిలో చురుకైన భాగస్వామ్యం కల్పిస్తూ సంస్థ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతలను సయ్యద్ మతీన్ నిర్వర్తించను న్నారు. జిల్లా పరిధిలో సంస్థ కార్యకలాపాలను విస్తరించడంతో పాటు ప్రజలకు మానవ హక్కులపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా సయ్యద్ మతీన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా చైర్మన్ బాధ్యతలు అప్పగించిన సంస్థ అధ్యక్షుడు విపిన్ చౌహాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజా సమస్యలు, మానవ హక్కులకు సంబంధించిన అంశాలపై తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.జిల్లా చైర్మన్‌గా సయ్యద్ మతీన్ నియామకంపై సంస్థ సభ్యులు, పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# అంగన్వాడి బడిలో పోషణ మాసం- పాల్గొన్న సర్పంచ్ రమాదేవి



**అడ్డగూడూరు సెప్టెంబర్ 19** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూర్ మండల పరిధిలో గల లక్ష్మీదేవికాల్వ గ్రామంలో అంగన్వాడీ బడిలో శనివారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ వల్లంభట్ల రమాదేవి, ×జఖా సూపర్ వైజర్ మదురమ్మ హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలింతలు, గర్భిణీ స్త్రీలు, చిన్నారులు పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలని, అంగన్వాడీలో ఇచ్చే పోషకాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కంబాల వీరయ్య, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్ మమత, ఆయా అశ్విని, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల భద్రతపై విద్యాశాఖ నిఘా ఎక్కడ?

●సర్వే నంబర్ 23లో రేడియంట్ హైస్కూల్ నిర్మాణంపై అనేక సందేహాలు.?

●అధికారుల మౌనం వెనుక మతలబేంటి?

●సర్వే నంబర్ 23లో పాఠశాల నిర్మాణంపై విద్యాశాఖ, రెవెన్యూ అధికారుల తీరుపై తీవ్ర ప్రశ్నలు

●భూమి రికార్డులు పరిశీలించారా? అనుమతులు ఎలా వచ్చాయి? పిల్లల భద్రతపై బాధ్యత ఎవరిది?





పీపుల్స్ న్యూస్

## ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ స్కూల్..?

●సర్వే నంబర్ 23లో రేడియంట్ హైస్కూల్ నిర్మాణంపై అనేక అనుమానాలు

●రెవెన్యూ.. టౌన్‌ప్లానింగ్.. విద్యాశాఖ అధికారుల మౌనం ఎందుకు?

కుత్బుల్లాపూర్ : సెప్టెంబర్ 7 (పీపుల్స్ న్యూస్)
ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ యంత్రాంగం వైఫల్యమా? లేక అధికారుల నిర్లక్ష్యానికి అక్రమ నిర్మాణాలు అద్దం పడుతున్నాయా? సూరారం శ్రీకృష్ణనగర్‌లోని సర్వే నంబర్ 23 ప్రభుత్వ భూమిలో రేడియంట్ హైస్కూల్ నిర్మాణం జరుగుతోందన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.ప్రభుత్వ భూమి అని రికార్డుల్లో ఉంటే అక్కడ ప్రైవేట్ విద్యాసంస్థ నిర్మాణానికి అనుమతి ఎలా లభించింది? భూమిపై యాజమాన్య హక్కు లేదా చట్టబద్ధమైన లీజ్ పత్రాలు లేకుండా పాఠశాల నిర్మాణానికి అనుమతులు ఎలా మంజూరయ్యాయి? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**నిర్మాణం కనిపించలేదా..?**
భవనం నిర్మాణం దశలవారీగా సాగుతున్నా కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు, గాజులరామారం సర్కిల్-57 టౌన్ ప్లానింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు పట్టించుకోలేదా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్మాణం పూర్తయ్యే వరకు అధికారులు ఎందుకు స్పందించలేదన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.తెలంగాణలో భవన అనుమతుల ప్రక్రియలో భూమి, భవనానికి సంబంధించిన అవసరమైన పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. నాన్-రెసిడెన్షియల్ నిర్మాణాలకు సంబంధించి TG-bPASS ద్వారా అనుమతుల ప్రక్రియ కొనసాగుతుంది.

**ప్రభుత్వ స్థలమైతే అనుమతి ఎవరిచ్చారు?**
సర్వే నంబర్ 23లోని స్థలం నిజంగా ప్రభుత్వ భూమి అయితే.. ప్రైవేట్ స్కూల్ నిర్మాణానికి అనుమతి ఇచ్చిన అధికారి ఎవరు? ఏ పత్రాల ఆధారంగా అనుమతి ఇచ్చారు? భూమి యాజమాన్యాన్ని ఎవరు నిర్ధారించారు? భవన నిర్మాణానికి మంజూరైన ప్లాన్ ఏమిటి? ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఉందా? అన్న ప్రశ్నలకు సంబంధిత శాఖలు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.అదేవిధంగా పాఠశాల గుర్తింపు కోసం భూమి యాజమాన్యం లేదా చట్టబద్ధమైన లీజ్ ఆధారాలు అవసరమని విద్యాశాఖ నిబంధనలు పేర్కొంటున్నాయి.

**ముడుపుల ఆరోపణలపై విచారణ ఎప్పుడు?**
స్థానికంగా అనుమతులు, నిర్మాణాల విషయంలో ముడుపుల వ్యవహారం నడుస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, వాటిపై ఆధారాలు బయటకు రావాల్సి ఉంది. అయితే ఈ ఆరోపణలు నిజమా? కాదా? అన్నది తేల్చాల్సిన బాధ్యత ఉన్నతాధికారులదే.ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన అధికారులు కళ్ల ముందే నిర్మాణాలు జరుగుతున్నా స్పందించకపోతే.. ప్రజలు అనుమానాలు వ్యక్తం చేయడం సహజమే.

**కలెక్టర్ స్థాయి విచారణకు డిమాండ్.**
సర్వే నంబర్ 23 భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, భూమి వర్గీకరణ, యాజమాన్య హక్కులు, పాఠశాలకు సంబంధించిన గుర్తింపు, భవన అనుమతులు, నిర్మాణ ప్లాన్, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వ భూమి అని నిర్ధారణ అయితే అనుమతులు ఎలా వచ్చాయి? నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగితే ఇప్పటివరకు చర్యలు ఎందుకు తీసుకోలేదు? బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు ఉంటాయా? అన్నదే ఇప్పుడు ప్రజల ప్రశ్న.ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన అధికారులు మౌనంగా ఉంటే.. ఆ మౌనం వెనుక కారణమేంటో ఉన్నతాధికారులు తేల్చాల్సిన సమయం ఆసన్నమైంది.

peoplesnews.online | 08 Sep, 2026 | Page: 11 | Clip ID: C-086120
For more details, visit peoplesnews.online



కుత్బుల్లాపూర్ : సెప్టెంబర్ 19 (పీపుల్స్ న్యూస్)
సర్వే నంబర్ 23లో రేడియంట్ హైస్కూల్ నిర్మాణం చుట్టూ నెలకొన్న వివాదంలో విద్యాశాఖ, రెవెన్యూ అధికారుల పాత్రపై ప్రశ్నలు మరింత తీవ్రమవుతున్నాయి. భూమి ప్రభుత్వ భూమి కాదా? నిర్మాణానికి అనుమతులు ఏ ఆధారాలతో మంజూరయ్యాయి? పాఠశాల నిర్వహణకు ముందు భవనానికి సంబంధించిన అన్ని రికార్డులను విద్యాశాఖ అధికారులు పరిశీలించారా? అనే ప్రశ్నలకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వ భూమిగా పేర్కొంటున్న సర్వే నంబర్‌లో నిర్మాణం కొనసాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నప్పుడు రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి భూమి హక్కులను ఎందుకు స్పష్టం చేయడం లేదు? భూమి ప్రభుత్వానికి చెందదని తేలితే అధికారిక రికార్డులతో ప్రజలకు ఎందుకు తెలియజేయడం లేదు? ప్రభుత్వ భూమేనని తేలితే తదుపరి చర్యలు ఎందుకు చేపట్టడం లేదన్నదే ప్రశ్న.

**విద్యాశాఖకు కనిపించని అక్రమాలు?**
పాఠశాల భవనం విషయంలో విద్యాశాఖ అధికారులు కేవలం పాఠశాల నిర్వహణను పరిశీలిస్తే సరిపోదు. భవన అనుమతులు, నిర్మాణ భద్రత, అగ్నిమాపక నిబంధనలు, విద్యార్థుల రక్షణకు సంబంధించిన ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అన్నదానిపై కూడా సంబంధిత నిబంధనల మేరకు తనిఖీలు అవసరం.అనుమతుల్లో ఏమైనా లోపాలు ఉంటే వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనం వహిస్తే, ఆ మౌనం అనేక అనుమానాలకు తావిస్తుందని స్థానికులు అంటున్నారు.

**ముడుపుల ఆరోపణలపై ఉన్నతస్థాయి విచారణ కావాలి.**
ఈ వ్యవహారంలో విద్యాశాఖ, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారులకు భారీ మొత్తంలో ముడుపులు అందాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు ఇప్పటివరకు అధికారిక నిర్ధారణ లేదు. అందువల్ల సంబంధిత ఉన్నతాధికారులు స్వతంత్ర విచారణ చేపట్టి, అనుమతుల ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకున్నాయో తేల్చాలని స్థానికులు కోరుతున్నారు.

**పిల్లల భద్రతపై నిర్లక్ష్యమా?**
పాఠశాల అంటే విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించే ప్రదేశం. అలాంటి భవన నిర్మాణం విషయంలో భూమి హక్కుల నుంచి భవన భద్రత వరకు ప్రతి అంశాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాల్సిందే. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత బాధ్యతలు నిర్ణయించడం కంటే ముందుగానే లోపాలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# ప్రియాంక కాలనీలో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

- విగ్రం ప్రభాకర్ గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం



(మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండల్ సెప్టెంబర్ 19
మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని ప్రియాంక కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. కాలనీలోని బాలాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కంచరి మాణిక్యం ఇంటి వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా విగ్రహం ప్రభాకర్ గౌడ్ దంపతులు, వారి కుమారులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తమ తండ్రి, కీర్తిశేషులు విగ్రం నారా గౌడ్ జ్ఞాపకార్థం ప్రభాకర్ గౌడ్ దంపతులు, వారి కుమారులు సంయుక్తంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో ప్రియాంక కాలనీవాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. వినాయకుని కృపతో అందరూ ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యంతో తులతూగాలని నిర్వాహకులు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ యూత్ సభ్యులు, కాలనీ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్ ఆధ్వర్యంలో చెక్కు పంపిణీ

అడ్డగూడూరు సెప్టెంబర్ 19 - :
తుంగతుర్తి శాసనసభ్యులు మందుల శామ్యూల్ ఆధ్వర్యంలో మంజూరైన చెక్కును పులిపలుపుల రజిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి చేతుల మీదుగా అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అడ్డగూడూరు టౌన్ ప్రెసిడెంట్ పూలపల్లి సోమిరెడ్డి , గోవిందపురం సర్పంచ్ బాలశౌర్ , మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలేముల విద్యాసాగర్ , అడ్డగూడూరు 6వ వార్డు సభ్యులు పూలపల్లి రాజశేఖర్ రెడ్డి పాల్గొని లబ్ధిదారునికి చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి సహాయం అందిస్తామని తెలిపారు.



# 30 నిమిషాల్లో బంగారు ఆభరణాలతో బ్యాగ్ అప్పగింత

●పోలీసుల చొరవ.. రాపిడో డ్రైవర్ నిజాయితీ

●12 తులాల బంగారం, రూ.10 వేల నగదు సురక్షితంగా బాధితురాలికి



హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 19 (పీపుల్స్ న్యూస్)
పోలీసుల తక్షణ స్పందనకు, ప్రజల నిజాయితీకి నిదర్శనంగా టోలిచౌకి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన చోటుచేసుకుంది. రాపిడో ఆటోలో పొరపాటున మర్చిపోయిన సుమారు 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు ఉన్న హ్యాండ్‌బ్యాగ్‌ను కేవలం 30 నిమిషాల్లోనే పోలీసులు బాధితురాలికి సురక్షితంగా అప్పగించారు.టోలిచౌకి ప్రాంతానికి చెందిన రుబియా ఐస్ మ్యాజిక్ వద్ద రాపిడో ఆటో ఎక్కి అల్ సబా హోటల్ వద్ద దిగారు. అయితే ప్రయాణంలో తన హ్యాండ్‌బ్యాగ్‌ను ఆటోలోనే మరిచిపోయారు. కొద్దిసేపటి తర్వాత బ్యాగ్ కనిపించకపోవడంతో ఆందోళనకు గురై రోడ్డుపై రోదిస్తుండగా అటుగా వెళ్తున్న క్యాబ్ డ్రైవర్ జాఫర్ ఖాన్ ఆమె పరిస్థితిని గమనించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.బాధితురాలి నుంచి సమాచారం అందుకున్న టోలిచౌకి క్రైమ్ బృందం డీఐ జి. బలరాజ్, ఎస్ఐ రవి కుమార్ ఆధ్వర్యంలో వెంటనే స్పందించింది. రాపిడో ప్రయాణ వివరాల ఆధారంగా ఆటో డ్రైవర్‌ను సంప్రదించి విషయం తెలియజేశారు.పోలీసుల సమాచారం అందుకున్న రాపిడో డ్రైవర్ వెంటనే పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఆటోలో ఉన్న హ్యాండ్‌బ్యాగ్‌ను యథాతథంగా అప్పగించారు. పోలీసులు బ్యాగ్‌లోని వస్తువులను పరిశీలించి, అందులో ఉన్న బంగారు ఆభరణాలు, నగదును బాధితురాలికి సురక్షితంగా అందజేశారు.

**నిజాయితీకి అభినందనలు**
బంగారు ఆభరణాలు, నగదు ఉన్నప్పటికీ వాటిని ఎలాంటి దురుద్దేశం లేకుండా తిరిగి అప్పగించిన రాపిడో డ్రైవర్ నిజాయితీని టోలిచౌకి పోలీసులు అభినందించారు. అలాగే ఆందోళనలో ఉన్న మహిళకు పోలీసుల సహాయం అందేలా చేసిన క్యాబ్ డ్రైవర్ జాఫర్ ఖాన్ సామాజిక స్పృహను ప్రశంసించారు.పోలీసుల తక్షణ స్పందన, పౌరుల సహకారం, రాపిడో డ్రైవర్ నిజాయితీతో విలువైన వస్తువులు కేవలం అరగంటలోనే యజమానికి చేరడం అభినందనీయం.

# కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు... జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

ఖమ్మం సెప్టెంబర్ 19
ఈ నెల 21న (సోమవారం) ఖమ్మం కలెక్టరేట్ లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని అనివార్య పరిపాలనా కారణాల రీత్యా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.మండల, డివిజన్ల స్థాయిలో నిర్వహించబడే ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా సోమవారం మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబడుతుందని కలెక్టర్ అన్నారు.ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# మహిళల భద్రతతోనే పండుగ వేడుకలకు సార్థకత

●గణేష్ సురక్ష సంకల్ప్--2026లో మహిళా భద్రతపై అవగాహన

●వేధింపులు ఎదురైతే షీ టీమ్స్‌ను ఆశ్రయించాలి: సీపీ సుమతి









మల్కాజిగిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 19 (పీపుల్స్ న్యూస్)
గణేష్ సురక్ష సంకల్ప్--2026లో భాగంగా మహిళల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. త్రిముల్‌ఘెర్రీ ఆర్టీసీ కాలనీలోని గణేష్ మండపం వద్ద జరిగిన మహిళా భద్రత--షీ టీమ్స్ అవగాహన కార్యక్రమంలో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహిళలు, యువతులు వేధింపులు లేదా అసౌకర్యానికి గురైనప్పుడు మౌనంగా ఉండకుండా పోలీసులను ఆశ్రయించాలని అవగాహన కల్పించారు. మహిళల భద్రత కోసం షీ టీమ్స్ అందిస్తున్న సేవలు, వేధింపులపై ఫిర్యాదు చేసే విధానం, అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం పొందే మార్గాలను వివరించారు.గణేష్ మండపాలకు వచ్చే భక్తులు మహిళలను గౌరవించాలని, మహిళల పట్ల అసభ్య ప్రవర్తనకు పాల్పడే వారిని ప్రోత్సహించకుండా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పండుగ వేడుకలు ప్రతి ఒక్కరికీ సురక్షితంగా, ప్రశాంతంగా సాగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు.మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించే వేడుకలే నిజమైన సంతోషాన్ని, సామాజిక బాధ్యతను ప్రతిబింబిస్తాయని పోలీసులు పేర్కొన్నారు.

# యాదాద్రిశుడికి నిత్య పూజలు.

## స్వామివారి నిత్య రాబడి. రూ.17.45 లక్షలు.



యాదగిరిగుట్ట
యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య క్షేత్రంలో ఆలయ అర్చకులు నిత్య ఆరాధనలు నిర్వహించారు. శనివారం స్వామివారి దర్శనానికి కుటుంబ సభ్యులతో వచ్చిన భక్తులు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో జరిగే సువర్ణ పుష్పార్చన నిత్య కళ్యాణం వేద ఆశీర్వచనం సాయంత్రం జరిగిన వెండి మొక్కు జోడి సేవలు, కార్తీక మాసం పురస్కరించుకొని కొండకిందగల సత్యనారాయణ స్వామి వ్రతాలలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. కొండపైన అనుబంధాలయమైన శ్రీ పర్వత వర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని భక్తులు దర్శించుకుని మొక్కు బడులు చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన పాత గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని సందర్శించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి నిత్య రాబడిలో భాగంగా శనివారం రోజున రూ.17,45,403,వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు లక్ష్మణచార్యులు అర్చకులు రాకేష్ కుమార్ చార్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## దెందుకూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్ మరియు మొక్కలు అందజేసిన దెందుకూరు గ్రామ సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు



**మధిర సెప్టెంబర్ 19**
దెందుకూరు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీమతి రాజకుమారి అధ్యక్షతన పాఠశాలలో మొక్కలు పంపిణీ చేసినారు అలాగే స్కూల్ యూనిఫార్మ్ విద్యార్థులకు అందజేసినారు .ఈ యొక్క కార్యక్రమంలో దెందుకూరు గ్రామ సర్పంచ్ శ్రీ ప్రగిడిపల్లి శ్రీనివాసరావు గారు గ్రామ పెద్దలు ఆం జనే ప్రసాద్ ,గంగరాజు ఇతర గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్ష

### దెందుకూరు సర్పంచ్ పగిడిపల్లి. శ్రీనివాసరావు

### ఏక్ పేడ్ మా కే నామ్ 3.0 కార్యక్రమంలో మొక్కల నాటిన సర్పంచ్







**మధిర సెప్టెంబర్ 19**
అమ్మ కోసం మొక్కలు నాటి... వాటిని కంటికి రెప్పలా కాపాడుకుందాం : విద్యార్థులకు పిలుపుదెందుకూరు : పచ్చదనం, పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన వాతావరణం అని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఏక్ పేడ్ మా కే నామ్ (తల్లి పేరిట ఒక మొక్క) 3.0 కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాల దెందుకూరు (యస్ సీ కాలనీ) మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ,అమ్మను ఏ విధంగా అయితే ప్రేమగా,కష్టపడి పెంచుకుంటామో...అదే రీతిలో మనం నాటే ప్రతి మొక్కనూ పిల్లల్లా భావించి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకోవడానికి,భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించడానికి మొక్కల పెంపకమే ఏకైక మార్గమని ఆయన పిలుపునిచ్చారు.విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై ప్రేమ,మొక్కల పట్ల శ్రద్ధ అలవర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాయల. ప్రసాద్ , ఊట్ల.రాంబాబు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామలరావు, ఉపాధ్యాయులు సునీత,నాగరాజు, మహమూద్ నాగ ప్రసన్న మరియు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైతులకు స్ప్రింక్లర్లు పంపిణీ చేసిన డీసీసీ ఉపాధ్యక్షులు



**దేవరకొండ 19సెప్టెంబర్**
నేరడుగొమ్ము మండల కేంద్రంలో రైతులకు సాగునీటి వినియోగంలో ఆధునిక పద్ధతులను ప్రోత్సహించేందుకు డీసీసీ ఉపాధ్యక్షులు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో రైతులకు స్ప్రింక్లర్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేసుకునేందుకు స్ప్రింక్లర్ పద్ధతి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని రైతులకు అన్ని రకాల వ్యవసాయ పనిముట్లను అందిస్తుందని అన్నారు.రైతులు ఆధునిక సాగు పద్ధతులను వినియోగించుకుని నీటిని పొదుపు చేసుకోవడంతో పాటు పంట దిగుబడులను పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్,సర్పంచ్ పులికంటి సుధాకర్, ఉపసర్పంచ్ ఎలిజర్ల శ్రీను, మాజీ ఎంపీటీసీ గిరి యాదయ్య,జోడుబావి తండ సర్పంచ్ మంజునాథ్,వార్డు మెంబెర్ ఈసం శివ,కొఠారి కంపెనీ డిసిఓ శ్రవణ్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, ముక్కమల్ల శ్రీను,సైదయ్య, రాములు,యాదయ్య,వెంకన్న,రైతులు పలుస శ్రీను, ముత్యాలు,వెంకటయ్య,రాములు,శ్రీనయ్య,ఈదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్‌నగర్‌లో విషాదం.. వ్యక్తి ఆత్మహత్య



**లక్షెట్టిపేట సెప్టెంబర్ 19** లక్షట్టిపేట పట్టణంలోని భగత్ సింగ్ నగర్ కు చెందిన గుర్రాల జయకర్ అనే 40 సంవత్సరాల వ్యక్తి ఇంటి సమీపంలోని వేప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. అందరికీ పెళ్లి లయ్యాయి. మృతునికి కుటుంబ కలహాలతో నిన్న గొడవలు జరగగా మృతుడు తన సోదరులకు ఫోన్ చేసి నాకు ఇంట్లో కుటుంబ కలహాలతో ఎప్పుడు గొడవ జరుగుతుంది నాకు బతకడం ఇష్టం లేదు అని ఫోన్ చేసి చెప్పి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరుడు గుర్రాల చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరుగుతుంది.

# భక్తుల భద్రతే లక్ష్యంగా గణేష్ ఉత్సవాలు

- నాగోల్‌లో 72 అడుగుల పర్యావరణహిత గణేష్ విగ్రహాన్ని పరిశీలించిన సీపీ సుమతి
- నిర్వాహకులతో ఏర్పాట్లపై సమీక్ష.. భద్రతా నిబంధనలు పాటించాలని సూచన





**మల్కాజిగిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 19 (పీపుల్స్ న్యూస్)**
గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరిగేలా మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఉత్సవాల్లో భాగంగా భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ నాగోల్‌లో ఏర్పాటు చేసిన 72 అడుగుల పర్యావరణహిత గణేష్ విగ్రహాన్ని సందర్శించారు.విగ్రహం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను సీపీ పరిశీలించి, ఉత్సవాల నిర్వహణకు సంబంధించి నిర్వాహకులతో వివరంగా చర్చించారు. భక్తుల రాకపోకలు, మండపం వద్ద భద్రత, రద్దీ నియంత్రణ, నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై నిర్వాహకుల నుంచి సమాచారం తెలుసుకున్నారు.

**భద్రతా నిబంధనల అమలుపై దృష్టి**
గణేష్ మండపాల వద్ద భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరి భద్రతను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలని సీపీ సూచించారు. మండప నిర్వాహకులు పోలీస్ శాఖ సూచించిన భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. విద్యుత్ భద్రత, అగ్ని ప్రమాదాల నివారణ, భక్తుల రాకపోకలకు తగిన మార్గాలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మండపం వద్ద ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ఉత్సవాల నిర్వహణలో నిర్వాహకులు పోలీస్ సిబ్బందితో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సీపీ తెలిపారు.

**పర్యావరణహిత విగ్రహంతో ప్రత్యేక ఆకర్షణ**
నాగోల్‌లో ఏర్పాటు చేసిన 72 అడుగుల గణేష్ విగ్రహం పర్యావరణహితంగా రూపొందించడం ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శనానికి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో రద్దీ నియంత్రణతో పాటు భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులు సూచించారు.

**ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు**
గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తులు, నిర్వాహకులు, పోలీసులు పరస్పర సమన్వయంతో పనిచేస్తే వేడుకలు మరింత ప్రశాంతంగా నిర్వహించవచ్చని అధికారులు తెలిపారు. ప్రజల సహకారంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తోందని పేర్కొన్నారు.



# గణనాథుడిని దర్శించుకున్న టీడీపీ నేత ఎస్ కే సత్తార్.

**కూకట్‌పల్లి నియోజకవర్గంలో గణేష్ మండపాల సందర్శన.**












**కూకట్‌పల్లి: సెప్టెంబర్ 19 (పీపుల్స్ న్యూస్)**
వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను టీడీపీ నాయకుడు ఎస్ కే సత్తార్ సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మండప నిర్వాహకులు, స్థానికులతో మాట్లాడి ఉత్సవాల ఏర్పాట్లను తెలుసుకున్నారు. గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, గణనాథుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు ఎస్.కె సత్తార్‌ను మర్యాదపూర్వకంగా కలసి స్వాగతించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఆదివారం,
సెప్టెంబర్ 20, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# జాతకంలో 'ఏలినాటి శని' ఉందా? - శనివారం ఇలా చేస్తే దోషాలు తొలగి, శుభ ఫలితాలు!



మనలో చాలా మందిని ఎక్కువగా భయపెట్టే జాతక దోషాల్లో ఒకటి ఏలినాటి శని. అప్పటివరకు సాఫీగా సాగిపోతున్న జీవితంలో ఒక్కసారిగా ఎదురుదెబ్బలు తగులుతున్నా, ఎంత కష్టపడినా ఫలితం దక్కకుండా మానసిక ఆందోళనలు వెంటాడుతున్నా 'నాకు ఏలినాటి శని నడుస్తోందా?' అని భయపడటం సహజం. అసలు ఏడున్నర సంవత్సరాల పాటు సాగే ఈ శని ప్రభావం నిజంగానే అంత భయంకరమైందా? లేక జీవితాన్ని సరైన దారిలో పెట్టే ఒక గుణపాఠమా? ఈ ఏలినాటి శని గురించి పూర్తి వివరాలు, దాని వెనుక ఉన్న అసలు రహస్యాలను ఈ స్టోరీలో తెలుసుకుందాం.ఏలినాటి శని గురించి ఎక్కువ ఆందోళన చెందాల్సిన అవసరం ఏమీ లేదంటున్నారు జ్యోతిష్య పండితులు. ఎందుకంటే ఇది ప్రతి ఒక్కరి జీవితంలో ముప్పై సంవత్సరాలకోసారి తప్పనిసరిగా వచ్చి ఏడున్నరేళ్లు ఉంటుందని చెబుతున్నారు. నిజానికి శనిని తిట్టుకోనవసరం లేదంటున్నారు. శని ఆయుఃకారకుడు. మందగమనుడు గనక తలపెట్టిన పనులను కాస్త ఆలస్యం చేస్తాడే తప్ప అసలు చేయకుండా ఉండడని చెబుతున్నారు. వివాహాలు, పదోన్నతులు వంటి ఏ శుభ కార్యాలైనా కేవలం శని మూలంగా ఆగవని గుర్తుంచుకోవాలంటున్నారు. అవి కావడం లేదంటే శనే కాకుండా జాతకంలో ఇతర గ్రహ ప్రభావాలు కూడా ఉంటాయనే విషయాన్ని గమనించాలని సచిస్తున్నారు పండితులు.

'శని' ప్రభావం ఎలా ఉంటుంది?

ఏలినాటి శని ప్రభావం ఏడున్నర సంవత్సరాలు ఉంటుంది. ఏలినాటిని ఏడునాడు అని కూడా అంటారు. నాడు అనగా అర్ధభాగం అని అర్థం. జాతకచక్రంలో 12 రాశులు ఉంటాయి. గ్రహాలు ఆయా రాశుల్లో ప్రవేశించిన టైమ్?లో గ్రహ ప్రభావం స్టార్ట్ అవుతుంది. శని గ్రహం 12, 1, 2 స్థానాల్లో ప్రవేశిస్తుంది. ఒక్కోస్థానంలో శని రెండున్నర సంవత్సరాలు ఉంటాడు. దీంతో మొత్తంగా ఏడున్నర ఏళ్లు శని ఉంటాడని అర్థం. శనిని పాపగ్రహంగా చెబుతుంటారు. అందుకనే కష్టాలు కలుగుతాయి. ఈ గ్రహం మన రాశిలో ఉన్నప్పుడు ప్రాణభయం, ధనం లేకపోవడం, ఒకవేళ వచ్చినా వెళ్లిపోవడం, మంచిస్థానం నుంచి అథమస్థానానికి వెళ్లిపోవడం తదితరాలు జరుగుతాయని చెబుతున్నారు జ్యోతిష్య పండితులు.శని మన రాశిలో ప్రవేశించినా కొన్ని మంచిపనులు చేసేందుకు దోహదం చేస్తాడంటున్నారు. ఉదాహరణకు పెళ్లి, ఇంటి నిర్మాణం, ఉద్యోగం వంటివి. అయితే వీటి వెనుక చాలా ఇబ్బందులు ఉంటాయి. మ్యారేజ్ జరిగితే చాలా ఖర్చు అవుతుంది. అలాగే ఇంటి నిర్మాణం పూర్తి చేయడమో లేక ఇంటిని కొనుగోలు చేస్తే అనంతరం ఆర్థిక వనరులకు ఇబ్బంది ఏర్పడుతుందని చెబుతున్నారు. ఒక ఉద్యోగి ఇంటిని కొనుగోలు చేస్తే అతడి నెల శాలరీ నుంచి నెలవారీగా వాయిదాలు చెల్లించవలసి ఉండటం వంటివాటితో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతుంటాయంటున్నారు.

'మేష లగ్నం' వారికి గుడ్?న్యూస్ - ఈ వారాలు బాగా కలిసొస్తాయట!

శని దోషాన్ని తగ్గించే పరిహారాలిలా!

కొన్ని పరిహారాలు పాటించడం ద్వారా శని దోష ప్రభావాన్ని కొంతమేర తగ్గించుకోవచ్చని చెబుతున్నారు జ్యోతిష్య పండితులు.

శని దోష ప్రభావ తీవ్రతను తగ్గించుకునేందుకు విష్ణుసహస్రనామం, సుందరాకాండ పారాయణం, ఆదిత్యహృదయం, భగవంతుని ప్రార్థన చేయాల్సి ఉంటుందంటున్నారు. దీంతో పాటు తీర్థయాత్రలు, వ్రతాలు ఆచరించాలని చెబుతున్నారు.శనివారం రోజు అరచేతి వెడల్పున్న నల్లవస్త్రంలో నల్ల నువ్వులను మూటలా కట్టి శనీశ్వరుడికి దానితో దీపారాధన చేయాలి. లేదా నవగ్రహాలకు తొమ్మిదిసార్లు ప్రదక్షిణచేసి, శనిదేవుడికి నువ్వుల నూనెతో దీపం వెలిగించినా ఫలితం ఉంటుందంటున్నారు. తొమ్మిది వారాలు ఇలా చేస్తే దోషాలు, కష్టనష్టాలు దూరమవుతాయన్నది శాస్త్రవచనం.ఏలినాటి శని దోషం నుంచి ఉపశమనం పొందడానికి పరమేశ్వరుని పంచాక్షరీ మంత్రాన్ని జపించాలి. పక్షులకు ఆహారం వేయాలని సూచిస్తున్నారు.

ముఖ్యంగా కాకులకు ఆహారం పెడితే మంచిదంటున్నారు. ఆవులకు ఆహారం వేయడంతో పాటు నల్ల చీమలకు చక్కెర వేయడం వంటి కార్యాలతో శని ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని చెబుతున్నారు.

యాచకులు, దివ్యాంగులకు పెరుగన్నం పెట్టినా శని తీవ్రత తగ్గుతుందని చెబుతారు పెద్దలు. అన్నింటికన్నా మనస్సును స్థిరంగా, పవిత్రంగా ఉంచుకొని ఆ పరమేశ్వరుని ఆరాధనలో ఉంటే ఏ గ్రహ ప్రభావమూ మనపై పడదంటున్నారు. ఏలినాటిశని దోష నివారణకు ఈ పరిహారం కూడా చాలా బాగా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. అదేంటంటే, ఇనుముతో ఒక చిన్న శని విగ్రహాన్ని తయారు చేయించాలి. తర్వాత దాన్ని మట్టికుండ లేదా ఇనుపపాత్రలో ఉంచాలి. దాని మీద నల్లటి క్లాత్ కప్పి, పూలూ గంధంతో పూజించి నువ్వులు, పులగంతోపాటు శక్తికొద్దీ దానం చేస్తే ఏలినాటి శని నివృత్తి అవుతుందని సూచిస్తున్నారు జ్యోతిష్య పండితులు.ముఖ్యగమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. అంతే కానీ, వీటిలో ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవనే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది గా మీ వ్యక్తిగత విషయం.

# వాహనదారులకు మారుతి సుజుకి బిగ్ షాక్: మళ్లీ పెరగనున్న కార్ల ధరలు- వివరాలు ఇవే!




దేశీయ కార్ల తయారీ రంగంలో తిరుగులేని ఆధిపత్యంతో కొనసాగుతున్న మారుతి సుజుకి ఇండియా (మీుతీబ్ఱ ాబఓబఎఱ ×అఎఱు) వాహనదారులకు మరోసారి గట్టి షాక్ ఇచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల కారణంగా తన కొన్ని మోడళ్ల ధరలను పెంచుతున్నట్లు సంస్థ సోమవారం అధికారికంగా ప్రకటించింది. ఈ తాజా నిర్ణయం ప్రకారం ఎంపిక చేసిన కార్ల మోడళ్లపై గరిష్ఠంగా రూ. 20,000 వరకు పెంపు ఉంటుంది. ఈ సవరించిన ధరలు ఈ నెల (సెప్టెంబర్ 2026) నుంచే అమలులోకి రానున్నట్లు మారుతి సుజుకి స్పష్టం చేసింది.గడిచిన మే నెల నుంచి కంపెనీ ధరలను పెంచడం ఇది మూడోసారి కావడం గమనార్హం. దీనికి ముందు ప్రకటించిన రెండు ధరల పెంపుదలలు కంపెనీ పోర్ట్‌ఫోలియోలోని దాదాపు అన్ని మోడళ్లకు వర్తించగా, ఈసారి మాత్రం కేవలం ఎంపిక చేసిన మోడళ్లపైనే భారాన్ని మోపారు. ఈ మేరకు మారుతి సుజుకి ఇండియా ఒక రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పూర్తి వివరాలను వెల్లడించింది."కార్ల తయారీకి అవసరమయ్యే ముడిసరుకుల వ్యయాలు (ఇన్‌పుట్ కాస్ట్స్) నిభారాన్ని మోపారు. ఈ మేరకు మారుతి సుజుకి రంతరాయంగా, విపరీ తంగా పెరుగుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కంపెనీపై పడుతున్న అదనపు ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి ఎంపిక చేసిన మోడళ్ల ధరలను రూ. 20,000 వరకు పెంచాలని నిర్ణయించాము. ఈ నూతన ధరలు సెప్టెంబర్ 2026 నుంచి తక్షణమే అమల్లోకి వస్తాయి" అని మారుతి సుజుకి తన నివేదికలో పేర్కొంది. గత కొన్ని నెలలుగా పెరుగుతున్న వ్యయాల ప్రభావాన్ని వినియోగదారులపై పడకుండా చూసేందుకు కంపెనీ అంతర్గతంగా అనేక రకాల వ్యయ నియంత్రణ చర్యలను చేపట్టినట్లు తెలిపింది. అయినప్పటికీ, మార్కెట్లో ద్రవ్యోల్బణ భారం రికార్డు స్థాయికి చేరడం, ప్రతికూల వ్యయ వాతావరణం సుదీర్ఘకాలం పాటు కొనసాగుతుండటంతో కంపెనీకి వేరే ప్రత్యామ్నాయం లేకుండా పోయిందని వివరించింది. ముడిసరుకుల ధరల భారాన్ని పూర్తిగా భరించడం సంస్థకు సాధ్యం కాకపోవడం వల్లే, అందులో కొంత భాగాన్ని మార్కెట్‌కు అంటే వినియోగదారులకు బదిలీ చేయక తప్పని పరిస్థితి ఏర్పడిందని కంపెనీ యాజమాన్యం వివరించింది. అయితే, ఈ భారం కస్టమర్లపై సాధ్యమైనంత తక్కువగా ఉండేలా చూసేందుకు తాము నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నామని మారుతి సుజుకి అదనంగా జోడించింది. ఆటోమొబైల్ రంగంలో స్టీల్, అల్యూమినియం, ప్లాస్టిక్ వంటి కీలక ముడిపదార్థాల ధరలు పెరగడం వల్ల కార్ల తయారీ వ్యయం గణనీయంగా పెరిగింది. పండుగల సీజన్ తీసుకున్న ఈ నిర్ణయం మధ్యతరగతి కొనుగోలుదారులపై అదనపు ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. అయినప్పటికీ కంపెనీ తన మార్కెట్ వాటాను కాపాడుకుంటూనే, నాణ్యమైన ౧ కట్టుబడి ఉన్నామని స్పష్టం చేసింది.

# వినాయక చవితి 2026- గణపతి ప్రతిష్ఠాపనకు సుముహూర్తాలు ఇవే!





దేశవ్యాప్తంగా ప్రజలందరూ ఒక్కటిగా సమైక్యంగా జరుపుకునే పండుగ వినాయక చవితి! ఈ ఏడాది వినాయక చవితి తేదీలో గందరగోళం? తిథి ద్వయం వల్ల పండుగ ఏ రోజు జరుపుకోవాలని విషయంపై స్పష్టత ఇస్తున్న పండితులు!

తిథి విషయంలో గందరగోళం!

తెలుగు పంచాంగం ప్రకారం పర్వదినాల మాసం భాద్రపద మాసంలో శుద్ధ చవితి రోజున వినాయక చవితి జరుపుకోవడం సంప్రదాయం. అయితే ఈ సంవత్సరం భాద్రపద శుద్ధ చవితి రెండు రోజుల్లో ఏర్పడనుండడంతో వినాయక చవితి జరుపుకునే విషయంలో కొంత గందరగోళం నెలకొంది. ఇదే అంశంపై పండితులు ఏమంటున్నారు? అసలు వినాయక చవితి ఎప్పుడు జరుపుకోవాలి? అనే విషయం గురించి పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

**వినాయక చవితి ఎప్పుడు?**

తెలుగు పంచాంగం ప్రకారం ఈ ఏడాది సెప్టెంబర్ 14, సోమవారం ఉదయం 7:10 నిమిషాల వరకు భాద్రపద శుద్ధ తదియ తిథి నెలకొని ఉంది. 7:11 నిమిషాల నుంచి భాద్రపద శుద్ధ చవితి తిథి ప్రవేశిస్తోంది. అయితే పండుగ జరుపుకోవాలంటే సూర్యోదయంతో తిథి ఉండాలి అనే నియమాన్ని అనుసరిస్తే వినాయక చవితి పండుగను సెప్టెంబర్ 14, సోమవారం కాకుండా సెప్టెంబర్ 15, మంగళవారం జరుపుకోవాలి. ఈ విధంగా పండుగ తిథి 14, 15 తేదీల్లో, రెండు రోజుల్లోనూ వ్యాపించి ఉండటంతో భక్తుల్లో సందిగ్ధత ఏర్పడింది.

పండితులు ఏమంటున్నారు?

శాస్త్ర నియమాల ప్రకారం వినాయక చవితి నిర్ణయానికి సంబంధించి పండితులు ముఖ్యమైన విషయాలను కూలంకుషంగా పరిశీలించిన పిదప తమ నిర్ణయాన్ని ఈ విధంగా వివరించారు.

మధ్యాహ్న వ్యాప్తి ముఖ్యం

వినాయకుడు భాద్రపద చతుర్థి నాడు మధ్యాహ్న సమయంలో జన్మించాడని పురాణాలు చెబుతున్నాయి. కాబట్టి చవితి తిథి ఏ రోజు మధ్యాహ్నం వేళలో ఉంటుందో, ఆ రోజే పండుగను జరుపుకోవాలని పురాణాలు చెబుతున్నాయి.

**సెప్టెంబర్ 14 నే పండుగ**

సెప్టెంబర్ 14, సోమవారం మధ్యాహ్నం అంతా చవితి తిథి పూర్తిగా అందుబాటులో ఉంది. కానీ సెప్టెంబర్ 15 మంగళవారం ఉదయం 7:44 గంటలకే తిథి ముగిసిపోతుంది. కాబట్టి సెప్టెంబర్ 14నే పండుగను, విగ్రహ ప్రతిష్ఠాపనను నిర్వహించాలని పండితులు నిర్ణయించారు.

**గణపతి ప్రతిష్ఠాపనకు సుముహూర్తాలు ఇవే!**

వినాయక చవితి రోజున అంటే సెప్టెంబర్ 14 సోమవారం నాడు గణేష్ చతుర్థి పూజ ప్రారంభించేందుకు, విగ్రహ ప్రతిష్ఠాపనకు వివరించిన శుభ సమయాలు ఇలా ఉన్నాయి.

**అభిజిత్ ముహూర్తం :** సోమవారం మధ్యాహ్నం 12:09 గంటల నుంచి మధ్యాహ్నం 12:58 గంటల వరకు శుభప్రదం

వినాయకుడి ఆరాధనకు శుభ సమయం: ఉదయం 11:05 గంటల నుంచి మధ్యాహ్నం 1:35 గంటల వరకు వినాయకుని పూజించడానికి ఆరాధించడానికి అత్యంత శుభకరమైన సమయమని పండితులు చెబుతున్నారు.

ఈ సమయంలో వినాయకుడి భక్తులు బొజ్జ గణపయ్యను ఆరాధించడం వల్ల శుభ ఫలితాలొస్తాయని పండితులు వివరిస్తున్నారు.

**అరుదైన యోగాలు:**

జ్యోతిష్యశాస్త్రం ప్రకారం, ఈసారి గణేష్ చతుర్థి రోజున అనేక శుభ యోగాలు ఏర్పడనున్నాయి. ఈ పవిత్రమైన రోజున బ్రహ్మ యోగం, ఇంద్ర యోగాలు ఏర్పడనున్నాయి. దీంతో పాటు చిత్రా నక్షత్రం మధ్యాహ్నం 1:55 గంటల వరకు ఉంటుంది. ఆ తర్వాత స్వాతి నక్షత్రం ప్రారంభమవుతుంది. ఈ రోజంతా బ్రహ్మ యోగం, ఇంద్ర యోగాల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఇంద్ర యోగం ప్రభావం మరుసటి రోజు అంటే అంటే సెప్టెంబర్ 15వ తేదీ మధ్యాహ్నం 12:19 గంటల వరకు ఉంటుంది. ఈ యోగాల వలన ఈసారి వినాయక చవితి అందరికీ శుభ ఫలితాలను ఇస్తుందని పండితులు చెబుతున్నారు.

**మినహాయింపు**

ఏదైనా అనివార్య కారణాల వల్ల లేదా స్థానిక ఆచారాల రీత్యా సోమవారం పూజ చేసుకోలేని వారు, సెప్టెంబర్ 15, మంగళవారం ఉదయం 7:44 గంటలలోపు చవితి తిథి ముగిసేలోగా పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకోవచ్చని పండితులు సూచిస్తున్నారు. కాబట్టి, వినాయక చవితి పండుగ ఎప్పుడు జరుపుకోవాలనే విషయంలో ఎలాంటి సందేహాలు పెట్టుకోకుండా సెప్టెంబర్ 14, సోమవారం నాడే పండుగ జరుపుకోవాలి. ఈ విధంగా బొజ్జ గణపయ్య పూజకు భక్తులు తగిన ఏర్పాట్లు చేసుకోవచ్చు.

ఓం శ్రీ మహాగణాధిపతయే నమః

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు

# 'ముడతలు, నల్లటి వలయాల'తో ఇబ్బంది పడుతున్నారా? - ఈ నేచురల్ టిప్స్ ట్రై చేయండి!



: ఈ రోజుల్లో ఒత్తిడి, కాలుష్యం కారణంగా చర్మ సౌందర్యాన్ని కాపాడుకోవడం ఒక పెద్ద సవాలుగా మారింది. అయితే, ఖరీదైన బ్యూటీ ప్రొడక్ట్స్ వాడడమే కాకుండా, మన దైనందిన జీవితంలో కొన్ని చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా చర్మాన్ని సహజంగా మెరిపించుకోవచ్చు. రోజ్? వాటర్, తేనె, బాదం నూనె చర్మ సంరక్షణకు తోడ్పడతాయి. రోజ్? వాటర్ చర్మానికి తాజాదనాన్ని, ఉపశమనాన్ని ఇస్తుంది. అలాగే, తేనె, బాదం నూనె చర్మంలోని తేమను నిలిపి ఉంచడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. చర్మ సంరక్షణలో ఎలా సహాయపడతాయి : తేనె సహజమైన హ్యూమెక్టెంట్‌గా పనిచేస్తుంది. ఇది చర్మంలో తేమను నిలిపి ఉంచడానికి, చర్మం మరింత మృదువుగా కనిపించడానికి సహా యపడుతు ంది. బాదం నూనె ఎమోలియంట్‌గా పనిచేస్తుంది. పొడిబారడాన్ని తగ్గిస్తుంది. అలాగే రోజ్ వాటర్ చర్మానికి చల్లదనాన్ని ఇస్తుంది. ఈ ప్రయోజనాలు చర్మం మొత్తం రూపాన్ని తాత్కాలికంగా మెరుగుపం చవచ్చు.ఎలా ఉపయోగించాలి : రోజ్?వాటర్, బాదం, తేనె పదార్థాలను కొద్ది పరిమాణంలో తీసుకుని బాగా మిక్స్ చేసి, శుభ్రమైన చర్మంపై పల్చటి పొరలా అప్లై చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసేటప్పుడు కళ్లలోకి వెళ్లకుండా జాగ్రత్త పడాలి. కాసేపు అలాగే ఉంచిన తర్వాత, చల్లటి నీటితో మెల్లగా కడిగేసుకోవాలి. ముఖ్యంగా, దీనిని అప్లై చేసేటప్పుడు లేదా తొలగించేట ప్పుడు కళ్ల కింద ఉండే సున్నితమైన చర్మాన్ని ఎప్పుడూ గట్టిగా రుద్దకూడదు.బరువు తగ్గినప్పుడు శరీరంలోని కొవ్వు ఏమవ ౢతుంది? - తెలిస్తే ఆశ్చర్యపోతారు!ఎల్లప్పుడూ ప్యాచ్ టెస్ట్ చేసుకోండి : ఈ మిశ్రమాన్ని ముఖంపై ఉపయోగించే ముందు, చేతి లోపలి భాగంలో లేదా చెవి వెనుక భాగంలో ప్యాచ్? టెస్ట్ చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. దురద, మంట, ఎరుపు లేదా వాపు వంటి సమస్యలు ఏవైనా వస్తున్నాయేమో కాసేపు గమనించాలంటున్నారు. ఒకవేళ చర్మంపై ఎలాంటి మంట లేదా అసౌకర్యం కలిగినా, ముఖ్యంగా సెన్సిటివ్ చర్మం ఉన్నా లేదా అలర్జీలు వచ్చే అవకాశం ఉన్నా వీటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.నల్లటి వలయాలు, ముడతలను తొలగిస్తుందా? : కళ్ల కింద నల్లటి వలయాలు, ముడతలను బాదం, తేనె, రోజ్? వాటర్? మిశ్రమం శాశ్వతంగా నయం చేయగలదని చెప్పడానికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవు. ఈ మిశ్రమం చర్మానికి కేవలం తాత్కాలికంగా తేమను మాత్రమే అందిస్తుందంటున్నారు నిపుణులు. నల్లటి వలయాల వెనుక జన్యుపరమైన లోపాలు, అలర్జీలు, వయసు పైబడటం, నిద్రలేమి వంటి అనేక అంతర్గత కారణాలు ఉంటాయి. కాబట్టి, కేవలం పైపూతలతోనే ఈ సమస్య పూర్తిగా పరిష్కారం కాదంటున్నారు నిపుణులు.ఆరోగ్యకరమైన చర్మం కోసం ప్రశాంతంగా నిద్రపోవడం, శరీరానికి తగినంత నీరు, సమతుల్య ఆహారం, ప్రతిరోజూ సన్ ?స్క్రీన్ రాసుకోవడం లాంటివి చేయా లంటున్నారు నిపుణులు. చర్మాన్ని ఎక్కువగా తాకడం లేదా గట్టిగా రుద్దడం లాంటివి చేయవద్దని చెబుతున్నారు. కళ్ల కింద నల్లటి వలయాలు, ముడతలు, మొటిమలు లేదా చర్మంపై నల్లటి మచ్చలు తగ్గకుండా ఉంటే వెంటనే డాక్టర్లను సంప్రదించడం

# పి.జి. లా కాలేజీలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి మరియు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి ఎ. శ్రీదేవి

● అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్




హైదరాబాద్, బషీర్‌బాగ్: బషీర్‌బాగ్‌లోని పి.జి. లా కాలేజీలో ఒక అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (సెషన్స్ డివిజన్, నాంపల్లి, హైదరాబాద్) కార్యదర్శి శ్రీమతి ఎ. శ్రీదేవి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి శ్రీమతి ఎ. శ్రీదేవి మాట్లాడుతూ, న్యాయ విద్య అంటే కేవలం చట్టంపై పరిజ్ఞానం పొందడం మాత్రమే కాదని, సమాజంలో న్యాయం, సమానత్వం మరియు రాజ్యాంగ విలువలను కాపాడే బాధ్యత కూడా ఇందులో ఇమిడి ఉందని పేర్కొన్నారు. ప్రాథమిక న్యాయ సూత్రాలతో పాటు న్యాయ వ్యవస్థలో జరుగుతున్న మార్పులు, కొత్త చట్టాలు మరియు న్యాయపరమైన పరిణామాల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని ఆమె ప్రతి న్యాయ విద్యార్థికి సూచించారు. న్యాయ వృత్తిలో నిజాయితీ, నైతిక విలువలు, క్రమశిక్షణ మరియు సామాజిక బాధ్యత అత్యంత కీలకమని ఆమె నొక్కి చెప్పారు. అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం, న్యాయ అవగాహన కార్యక్రమాలు, న్యాయ సేవా శిబిరాలు, లోక్ అదాలత్‌లు, మధ్యవర్తిత్వం మరియు వ్యాజ్యానికి పూర్వ పరిష్కార సేవలు వంటి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి విద్యార్థులకు వివరించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, మహిళలు, పిల్లలు, వృద్ధులు మరియు ఇతర అర్హులైన వారికి న్యాయ సహాయం అందించడంలో తమవంతు సహకారం అందించాలని ఆమె న్యాయ విద్యార్థులను మరియు న్యాయవాదులుగా మారాలనుకునే వారిని కోరారు. విద్యార్థి దశ నుండే ప్రజలతో మమేకమై, న్యాయపరమైన సమస్యలను అర్థం చేసుకుని, ప్రజలకు వారి హక్కులు మరియు న్యాయ సేవలపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. కోర్టు విధానాలు, న్యాయ ప్రక్రియలు మరియు ప్రత్యామ్నాయ వివాద పరిష్కార యంత్రాంగాలపై ఆచరణాత్మక అవగాహన పెంపొందించుకోవడం ద్వారా తమ వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని కూడా వారికి సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పి.జి. లా కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీమతి అపర్ణ, లా సెట్ కన్వీనర్ శ్రీమతి విజయలక్ష్మి, ప్రొఫెసర్ విజయ భాస్కర్ రెడ్డి, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా, న్యాయ విద్యార్థులు తమ చదువుతో పాటు సమాజం పట్ల తమకున్న బాధ్యతలను, అలాగే న్యాయ సేవల ప్రాముఖ్యతను మరియు ప్రజలకు న్యాయాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో తమ పాత్రను గురించి తెలుసుకున్నారు.

# ఆయుర్వేదం ఆరోగ్యానికి అమృతధార

- ప్రతిఒక్కరూ ఆయుర్వేదం విశిష్టతను గుర్తించాలి
- దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి
- ఘనంగా 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ, సెప్టెంబర్ 19, 2026:** ఆయుర్వేదం కేవలం ఒక వైద్య విధానం మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అందించే భారతదేశ ప్రాచీన విజ్ఞాన సంపద అని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సుసంపన్న, ఆరోగ్య, ఆనంద ఆంధ్ర నిర్మాణానికి ఇది ఎంతగానో తోడ్పడుతుందని పేర్కొన్నారు. 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఆయుష్ శాఖ, డా. ఎన్ఆర్ఎస్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాల, డా. ఏఎల్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రి, జిల్లా ఆయుష్ విభాగం, అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ఆరోగ్యకర భవితకు ఆయుర్వేదం ఇతివృత్తంతో ఏర్పాటుచేసిన ర్యాలీని కలెక్టర్ లక్ష్మీశ.. డా. ఎన్ఆర్ఎస్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాల ప్రిన్సిపల్ టి.బుల్లయ్య, డా. ఏఎల్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.జగదీష్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో వేల సంవత్సరాలుగా ఆయుర్వేదానికి ప్రత్యేక స్థానం ఉందని.. ఆయుర్వేద ప్రాథమిక సూత్రం సమగ్ర ఆరోగ్య సంరక్షణకు మార్గదర్శకంగా నిలుస్తోందని తెలిపారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించడంతో పాటు, వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, సమతుల్య ఆహారం, క్రమబద్ధమైన జీవన శైలి, ప్రకృతితో అనుసంధానంగా జీవించడం వంటి అంశాలకు ఆయుర్వేదం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో ఆరోగ్య పరిరక్షణపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని.. దుష్పరిణామాలు లేని ఆయుర్వేదంలోని ఆరోగ్య సంరక్షణ సూత్రాలు, ఆహార నియమాలు వంటి అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించవచ్చన్నారు. ఆరోగ్యవంతమైన ప్రజలు.. ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అని, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ఆయుర్వేదం వంటి భారతీయ ప్రాచీన వైద్య విజ్ఞాన సంపదకు తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని.. ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ జిల్లా ఆయుష్ అధికారి డా. వై.రత్న ప్రియదర్శిని, ఆయుర్వేద ఆసుపత్రుల సీనియర్ వైద్యాధికారులు, యూజీ, పీజీ విద్యార్థులు, సిబ్బంది, ఎన్‌టీఆర్ జిల్లా ఆయుష్ విభాగం వైద్య అధికారులు తదితరులు పాల్గొన్నారు. సమాచార, పౌర సంబంధాల శాఖ, ఎన్‌టీఆర్ జిల్లా ద్వారా జారీ

# సెప్టెంబర్ 27న ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం

- జిల్లా పర్యాటక వైభవాన్ని చాటేందుకు యువతకు ప్రత్యేక అవకాశం
- విద్యార్థులు, యువత సృజనాత్మకతకు ప్రత్యేక వేదిక
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, సెప్టెంబర్ 19, 2026:** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 27వ తేదీ ఆదివారం ఎన్‌టీఆర్ జిల్లాలో ఘనంగా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. డా. బి.ఆర్. అంబేద్కర్ స్మృతి వనం, జిల్లా కలెక్టరేట్, రాఘవయ్య పార్క్‌లలో వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధిని ప్రోత్సహించడంతో పాటు విద్యార్థులు, యువతను పర్యాటక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొనడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ కళారూపాల్లో తమ ప్రతిభను ప్రదర్శించేందుకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

**సెప్టెంబర్ 24న ప్రతిభా ఎంపిక:** సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ వస్త్రధారణ, ఇతర ప్రదర్శనల్లో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు సెప్టెంబర్ 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు డా. బి.ఆర్. అంబేద్కర్ స్మృతి వనం వద్ద నిర్వహించే ఎంపిక కార్యక్రమానికి హాజరై తమ ప్రతిభను ప్రదర్శించాలని కోరారు. ఎంపిక కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన వారికి సెప్టెంబర్ 27న నిర్వహించే ప్రపంచ పర్యాటక దినోత్సవ ప్రధాన కార్యక్రమంలో ప్రదర్శనకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పర్యాటక ప్రాంతాలు, చారిత్రక ప్రదేశాలు, సాంస్కృతిక వారసత్వానికి సంబంధించిన చిత్రాలు, కళాఖండాలు, సంప్రదాయ వస్తువులు, పర్యాటక సమాచారాన్ని కోడ్‌లతో కూడిన స్టాళ్ల రూపంలో ప్రదర్శించేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు, సంస్థలు పాల్గొనవచ్చని తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లా సంప్రదాయ ఆహార సంస్కృతిని ప్రోత్సహించే విధంగా సంప్రదాయ వంటకాల స్టాళ్లను ఏర్పాటు చేసి సందర్శకులకు పరిచయం చేసేందుకు ఆసక్తి ఉన్నవారు కూడా పాల్గొనవచ్చని జిల్లా పర్యాటక అధికారి డా. కొల్లేటి రమేష్ తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధిలో యువత, విద్యార్థులు, స్థానిక సమాజం భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా జిల్లాలోని ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతిక, వారసత్వ పర్యాటక ప్రాంతాలకు మరింత ప్రచారం కల్పించవచ్చని పేర్కొన్నారు.

**ఎంపిక కార్యక్రమం:**
**24 సెప్టెంబర్ 2026**
**మధ్యాహ్నం 3.00 గంటలకు**
**డా. బి.ఆర్. అంబేద్కర్ స్మృతి వనం, విజయవాడ**
**సంప్రదించవలసిన వారు:లి**
**డా. కొల్లేటి రమేష్**
**జిల్లా పర్యాటక అధికారి, ఎన్‌టీఆర్ జిల్లా**
**94879 16504**
**శ్రీమతి భారతి -- 9849063213**
**శ్రీమతి మాధురి -- 9704466650**
**స్పృహాప్తి ట్రస్ట్**

# మైనారిటీల సంక్షేమంలో సర్కార్ విఫలం

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ):** రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమానికి కేటాయించిన నిధులను ఖర్చు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, నిధుల కోసం పోరాడటంలో ఎంఐఎం పూర్తిగా చేతులెత్తేసిందని బీఆర్ఎస్ సీనియర్ షేక్ అబ్దుల్లా సోహైల్ శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. మాత్రమే ఖర్చు చేశారని శాసనసభా వేదికగా ప్రభుత్వమే అంగీకరించి ందని సోహైల్ గుర్తుచేశారు. గత రెండు బడ్జెట్లలో మైనారిటీల సంక్షేమ కోసం రూ. 5,100.97 కోట్లు కేటాయించి, రూ. 1,972.17 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని శాసనసభా వేదికగా



ప్రభుత్వమే అంగీకరించిందని సోహైల్ గుర్తుచేశారు. నిధులను ఖర్చు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, నిధుల కోసం పోరాడటంలో ఎంఐఎం పూర్తిగా చేతులెత్తేసిందని మజ్లిస్ నేతలు అసెంబ్లీ సమావేశాల్లో మైక్‌ల ముందే ప్రశ్నిస్తూ మొకుబడి చర్యలకే పరిమితమవుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. శాసనసభా వేదికగా ప్రభుత్వమే అంగీకరించి ఒదనినిధుల కోసం పోరాడటంలో పూర్తిగా చేతులెత్తేసిందని బీఆర్ఎస్ సీనియర్ షేక్ అబ్దుల్లా సోహైల్ శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. నిధుల కేటాయింపు, విడుదల, లబ్ధిదారుల వివరాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని సోహైల్ డిమాండ్ చేశారు.

# పోషణ్ మాసం 2026 మన అంగన్వాడి మన బాధ్యత కార్యక్రమం లో పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

- ఆరోగ్యవంతమైన సమాజ నిర్మూలనకు పౌష్టికాహారం అవసరం గర్భిణీలకు శ్రీమంతం తల్లి బిడ్డ ఆరో గ్యానికి ప్రాధాన్యం



**విజయనగరం:** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మూలన కోసం పౌష్టికాహారం ఎంతో అవసరమని రాష్ట్ర చిన్న మధ్య తరహా పరిశ్రమల ఎన్నారై శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు తెలిపారు. పోషణ మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా గజపతినగరం నియోజకవర్గం గంట్యాడ ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ ప్రాజెక్టు బుడతనపల్లి సెక్టారు పరిధిలో ఉన్న గోడియడా గ్రామంలో మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు శనివారం పోషణ మాసోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు సీమంతం, ఆరు నెలలు దాటిన పిల్లలకు అన్నప్రాసన, సంవత్సరం న్నర వయస్సు దాటిన పిల్లలకు ఆరోగ్య బాలల పోటీ (వెల్ బేబీ షో) నిర్వహించడం జరిగింది. మంత్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ గర్భిణీలకు సీమంతం వేడుక ప్రత్యేకత.. తల్లి, బిడ్డ ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యం సీమంతం (శ్రీమంతం) అనేది గర్భిణీ స్త్రీకి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కలిసి ఆశీర్వాదాలు అందించే ముఖ్యమైన సంప్రదాయ వేడుకన్నారు గర్భధారణ సమయంలో తల్లి సంతోషంగా, ప్రశాంతంగా ఉండటంతో పాటు ఆమెకు అవసరమైన పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో ఈ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో జరుగుతున్నాయి అన్నారు. సీమంతం వేడుకలో కుటుంబ సభ్యు లు, బంధువులు కలిసి గర్భిణీని ఆశీర్వదించడం ద్వారా ఆమెకు మానసిక ఆనందం, ధైర్యం కలుగుతుందని సంప్రదాయంగా నమ్ముతారు. ముఖ్యంగా గర్భిణీ ఒత్తిడి, ఆందోళన తగ్గి సంతోషంగా ఉండేందుకు కుటుంబ సభ్యుల ప్రేమ, ఆప్యాయత దోహదపడతాయన్నారు తల్లి బిడ్డ ఆరోగ్యం కోసం అంగన్వాడి కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించబడుతుందని ఇది లబ్ధిదారులందరూ వినియోగించుకోవాలని కోరారు. ఆరు నెలలు నిండిన వెంటనే అన్నప్రాసన్న చేయడం వలన పిల్లలు పౌష్టికాహారం తిని ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. అదేవిధంగా సంవత్సరం వయసుకి టీకాలన్ని పూర్తిచేసుకుని వయసుకు తగ్గ బరువు ఎత్తుతో ఆరోగ్యంగా ఉన్న బాలలకు ప్రోత్సహించడం వెల్ బేబీషో కుటుంబంలో ఉత్సాహం కలిగించే సందర్భాలని మంత్రి తెలిపారు. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి అక్టోబర్ 8 వ తేదీ వరకు అన్ని అంగన్వాడీ కేంద్రాలలో పోషణ మాసోత్సవాలు జరుగుతాయన్నారు ఈ సందర్భంగా రాగి పిండి, మునగాకు, బాలామృతం ఉపయోగించి వంటకాలను తయారుచేసి పోషకాహార ప్రదర్శనను ఏర్పాటు చేసిన స్టాళ్లు సందర్శించారు గర్భిణీ స్త్రీల శ్రీమంతం వేడుకల్లో పాల్గొని పసుపు కుంకాలు చీర గాజులు పండ్లు అందించారు ఏడు సంవత్సరాలు దాటిన పిల్లలకు అన్నప్రాసన్న కార్యక్రమాన్ని మంత్రి శ్రీనివాస్ చేతుల మీదుగా చేశారు . అంగన్వాడి చిన్నారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఉమాభారతి సెక్టర్ సూపర్వైజర్ అనురాధ బిజెపి అధ్యక్షురాలు రెడ్డి పావని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్ నాయుడు టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ వెంకట ప్రసాదు ఎంపిటిసి వర్రీ సన్యాసిరావు మాజీ సర్పంచ్ బొబ్బిలి రామ్ నాయుడు కొప్పల వెలమ డైరెక్టర్ విజయకుమార్ ఎంపీడీవో రమణమూర్తి గ్రామస్తులు పాల్గొన్నారు

# రాష్ట్రంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఏపీ ప్రభుత్వం కట్టుబడి ఉంది మంత్రి కందుల దుర్గేష్



- విజయవాడలో ఘనంగా మహాకవి బోయి భీమన్న జయంతి ఉత్సవాలు
- ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ
- అవార్డు గ్రహీత, ప్రముఖ రచయిత భూసురపల్లి వెంకటేశ్వర్లుకు 'బోయి భీమన్న అవార్డు-2026' ప్రదానం..రూ. 2 లక్షల పారితోషికం అందజేసిన మంత్రి దుర్గేష్
- అర్హులైన కళాకారులందరికీ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో త్వరలోనే ఐడీ కార్డులు అందిస్తాం
- రాజమహేంద్రవరం తెలుగు వర్సిటీకి 'బోయి భీమన్న కళాపీఠం' తరలింపుకు చర్యలు
- మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ: సెప్టెంబర్ 19,2026:** ఏపీలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శనివారం మహాకవి, పద్మభూషణ్ బోయి భీమన్న జయంతి వేడుకలు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కలెక్టరేట్‌కు విచ్చేసిన మంత్రివర్యులకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమ ప్రారంభంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోయి భీమన్న జీవిత ఛాయాచిత్రమాలికను మంత్రి దుర్గేష్ పరిశీలించారు. అనంతరం వేదికపై జ్యోతి ప్రజ్వలన చేసి, బోయి భీమన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వేడుకలో భాగంగా లో గుంటూరు జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత, సాహితీవేత్త భూసురపల్లి వెంకటేశ్వర్లుని 'బోయి భీమన్న అవార్డు-2026'తో పురస్కరించారు. ఆయనకు జ్ఞాపిక, శాలువాతో పాటు రూ. 2,00,000 నగదు పారితోషికం చెక్కును మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.."మహాకవి బోయి భీమన్న భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన రచనల ద్వారా అమరుడయ్యారు, ప్రాతఃస్మరణీయుడిగా నిలిచారు. ఆయన కవితాధోరణికి, ఉదాత్త భావజాలానికి నిజమైన అర్ధాంగి, సర్వస్వం ఆయన సతీమణి హైమావతి. భీమన్న రచనలు సమాజంలో ఎంతో స్పృహను, చైతన్యాన్ని రగిలించాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి పూర్తిగా కట్టుబడి ఉంది. నేటి తరానికి మహామహుల రచనలను అందించి సామాజిక వికాసానికి దోహదపడతాం. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతో చర్చించి, ప్రస్తుతం తెలంగాణలో ఉన్న భీమన్న కళాపీఠాన్ని ఆంధ్రప్రదేశ్ లోని రాజమహేంద్రవరంలో ఉన్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి తీసుకురావడానికి తగిన చర్యలు తీసుకుంటాం. సాంస్కృతిక శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎస్ ఎస్ రావత్ తో మాట్లాడి అర్హులైన ప్రతి కళాకారునికి గుర్తింపు కార్డులు ఇప్పిస్తాం అన్నారు.. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ పనితీరును శ్రీకృష్ణదేవరాయల భువనవిజయంలోని అష్టదిగ్గజాలతో పోల్చవచ్చని మంత్రి దుర్గేష్ చమత్కరించారు. బోయి భీమన్న సతీమణి బోయి హైమావతి మాట్లాడుతూ.. భీమన్న జయంతి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, మంత్రి దుర్గేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంత్రి దుర్గేష్ ప్రసంగ శైలిని, వాగ్ధాటిని ఈ సందర్భంగా ఆమె ప్రశంసించారు. రాష్ట్ర నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. బోయి భీమన్న గొప్ప సామాజిక రచయిత అని, సమాజ శ్రేయస్సు కోరిన ఆయన సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదివి అవగాహన చేసుకోవాలని సూచించారు. అవార్డు గ్రహీత భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువా, బోయి భీమన్నలను త్రిమూర్తులుగా, మహాకవులుగా కీర్తించారు. ఈ ముగ్గురూ పద్మ పురస్కారాలు పొందారని గుర్తుచేశారు. కవితా ప్రపంచాన్ని ఏలిన భీమన్న పేరిట తనకు అవార్డు రావడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. భీమన్న సతీమణి హైమావతి కృషి వల్లే ఆయనకు ఈ గౌరవం ప్రతీ ఏటా దక్కుతోందని పేర్కొన్నారు. మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం అధ్యక్షులు పూల త్రివిక్రమరావు మాట్లాడుతూ..సీఎం చంద్రబాబు నాయుడు తర్వాత అంతటి కష్టం చేసే మనస్తత్వం ఉన్న వ్యక్తి మంత్రి కందుల దుర్గేష్ అని కొనియాడారు. సాహిత్యంలో అన్ని ప్రక్రియల్లోనూ రచనలు చేసి నైతిక, సామాజిక విలువలు పెంచిన బోయి భీమన్న కళాపీఠాన్ని ఏపీకి తీసుకువచ్చి, ఆయన సాహిత్యాన్ని పుస్తక రూపంలో ముద్రించాలని కోరారు. నేటి తరానికి మహామహుల రచనలను అందించి సామాజిక వికాసానికి దోహదపడతాం. సీఎం చంద్రబాబు నాయుడు,

సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ..రాష్ట్రంలో మళ్లీ సాంస్కృతిక పునరుజ్జీవనం వచ్చిందంటే అది మంత్రి దుర్గేష్ చొరవే అని కొనియాడారు. భీమన్న రాసిన 'పాలేరు', 'గూడు కాలిపోతుంది' వంటి రచనలు దళితుల జీవితాల్లో వెలుగులు నింపి చైతన్యపరిచాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, అధికార భాషా సంఘం అధ్యక్షులు పూల త్రివిక్రమరావు, బోయి భీమన్న సతీమణి బోయి హైమావతి, వారి కుటుంబ సభ్యులు, సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు, అధికారులు సుమన్, శ్రీనివాస్, పలువురు ప్రముఖ రచయితలు, కవులు మరియు కళాకారులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు

## అనాధ వృద్ధుడి మృతదేహానికి అంత్యక్రియలు



**టీ నర్సాపురం, సెప్టెంబర్ 19,** మండలంలోని వీరభద్రవరం గ్రామంలో వీరంకి సాయి వద్ద ఉంటున్న ముంతాల మోహనరావు అనే అనాధ వృద్ధుడికి కామవరపుకోట సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించడం జరిగింది. మోహనరావుకు కుటుంబంలో ఎవరూ లేరని జైపూర్ రాష్ట్రం ముమ్మూరు అని చెప్పేవాడని సాయి తెలిపారు. తనను ఎంతో బాగా చూసుకునే సాయి వద్ద ఇంటి పనులు చేస్తూ ఉండేవాడని, తన మరణానంతరం శాస్త్రబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించాలని కోరాడని, అనుకోని అతిథిలా ఇరవై సంవత్సరాల క్రితం ఇంటి నుండి వచ్చి ఎవరూ లేకపోవడంతో తమతో కలివిడిగా ఉండే మోహనరావు మృతి పట్ల సాయి కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మానవతా సంస్థ వారి శాంతి రథంలో జంగారెడ్డిగూడెం తీసుకువెళ్లి హిందూ స్మశాన వాటికలో శాస్త్ర ప్రకారం సహాయ పౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ వీరమల్ల మధు, వీరంకి సాయిల ఆధ్వర్యంలో దహన సంస్కారాలు నిర్వహించడం జరిగింది. అనాధ మృతదేహానికి అంత్యక్రియలు చేయటం పట్ల పలువురు మధు, సాయి లను అభినందించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి ఆఖరి ఘడియలలో మృతి చెందిన మోహన్ రావు అంత్యక్రియలు చేయటం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు.

## స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణంతో ఆరోగ్యకరమైన సమాజం సాధ్యం
- జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ



**కంచికచర్ల: సెప్టెంబర్ 19, 2026:** పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని తీర్చిదిద్దేందుకు ప్రతి కుటుంబం బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పిలుపునిచ్చారుకంచికచర్ల మండలం మున్నలూరు గ్రామంలో శనివారం జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా "హరిత ఆంధ్ర -- శీతల ఆంధ్ర" అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు పలు సూచనలు చేశారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి కుటుంబం తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ప్రతి ఇంటిలోనే తడి, పొడి చెత్తను వేరు చేయడం అలవాటుగా మార్చుకోవాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని తెలిపారు. విస్తృతంగా మొక్కలు నాటడం, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవడం ద్వారా రాష్ట్రాన్ని హరిత ఆంధ్ర – శీతల ఆంధ్రగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం, పరిశుభ్రమైన పరిసరాలను ఏర్పాటు చేయడం ద్వారా గ్రామాల్లో ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని కల్పించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. "స్వచ్ఛ భారత్ -- స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్" లక్ష్య సాధనకు ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ కేవలం పారిశుద్ధ్య సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రతి కుటుంబం, ప్రతి గ్రామస్తుడు దీనిని సామాజిక బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. ప్రతి ఇంటి నుంచి సేకరించే చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని ప్రజలకు సూచించారు. ఇళ్ల పరిసరాల్లోనూ, బహిరంగ ప్రదేశాల్లోనూ చెత్త వేయకుండా గ్రామంలో ఏర్పాటు చేసిన పారిశుద్ధ్య వ్యవస్థను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం క్రమం తప్పకుండా జరిగేలా సంబంధిత సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ప్రజలు కూడా చెత్త సేకరణ సిబ్బందికి సహకరిస్తూ, తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని సూచించారు. చెత్తను రహదారుల పక్కన, కాలువల్లో, ఖాళీ ప్రదేశాల్లో వేయడం వల్ల పరిసరాలు కలుషితమై ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అందువల్ల బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడం ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్యం, ఆహ్లాదకరమైన జీవన పరిస్థితులు కల్పించవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పరిశుభ్రత, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణను ప్రజలు తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని పిలుపునిచ్చారు. "స్వచ్ఛ భారత్ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్" కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని, ప్రతి కుటుంబం తమ ఇంటి నుంచే పరిశుభ్రతకు శ్రీకారం చుట్టాలని జిల్లా కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ మున్నలూరు గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, గ్రామ పరిసరాల పరిశుభ్రత, కిచెన్ గార్డెన్స్ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటి చెత్త సేకరణ విధానం, చెత్త వేర్పాటు, పారిశుద్ధ్య సిబ్బంది పనితీరు, గ్రామంలోని పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించి, అవసరమైన చోట్ల తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ వ్యవస్థ నిరంతరం సమర్థవంతంగా కొనసాగేందుకు అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ స్పష్టం చేశారు. ప్రతి కుటుంబం తమ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరు చేయడం, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ఉండడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, మొక్కలను నాటి సంరక్షించడం వంటి చర్యలను పాటించాలని సూచించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో, ఆరోగ్యకరమైన జీవన వాతావరణంతో తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. మున్నలూరు గ్రామ రైతు చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారు చేసి వినియోగించడం ద్వారా పొందుతున్న లాభాలను సబాముఖంగా వివరించారు. తొలుత జిల్లా కలెక్టర్, పర్యావరణాన్ని పరిరక్షించడానికి, తల్లులను గౌరవించడానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ "ఏక్ పేడ్ మా కే నామ్" ప్రచార కార్యక్రమంలో భాగంగా గ్రామంలో స్వయంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి టి.సీతామహాలక్ష్మి, నందిగామ ఆర్డీవో గడ్డిపాటి అనిల్ కుమార్, డిఎల్డివో బి.లక్ష్మి కుమారి, మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి బాబు, తహసిల్దార్ నరసింహారావు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో కానీ బాబు, గ్రామ ప్రత్యేక అధికారి అప్పారావు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది, స్వచ్ఛంద కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు మున్నలూరు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారుజిల్లా సమాచార శాఖ, విజయవాడ నుండి జారీచేయడమైనది.

## ఆడబిడ్డల ఆత్మగౌరవం బతుకమ్మ




**హైదరాబాద్, సెప్టెంబర్ 19** బతుకమ్మ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి నిలువెత్తు రూపమని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తెలిపారు. మన సంస్కృతి విశిష్టతను విశ్వవ్యాప్తం చేయడంలో ఎన్నారైలు పోషిస్తున్న పాత్ర అభినందనీయమని కొనియాడారు. లండన్ వేదికగా నిర్వహించనున్న 'టాక్ చేనేత బతుకమ్మ-దసరా 2026' సంబురాల పోస్టర్‌ను శనివారం హైదరాబాద్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశపతి మాట్లాడుతూ చేనేత అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, అది సాంస్కృతిక వారసత్వానికి చిహ్నమని చెప్పారు.ప్రపంచ పటాలు పరిశీలించండిబతుకమ్మ ఉత్సవాలను చేనేతతో ముడిపెట్టి నిర్వహించడం వల్ల నేతన్నలకు చేయూత లభించడంతో పాటు మన వస్త్ర కళా నైపుణ్యం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నదని పేర్కొన్నారు. బతుకమ్మ, బోనాల పండుగలకు నాడు కేసీఆర్ రాష్ట్ర పండుగ హోదా కల్పించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో టాక్ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, అధికార భాషా సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి, ప్రముఖ రచయిత మానుకోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమం



**కామవరపుకోట, సెప్టెంబర్ 19:** కామవరపుకోట శివారు కొత్తపేట బీసీ కాలనీలో వినాయక చవితి సందర్భంగా బాల గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహ దాతలు అన్నదాతలైన బోళ్ల ప్రసాదు వారి తనయుడు లోకేష్ ను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పెద్దలు సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక భావనలో పెంపొందించేలా చిన్నారులకు అవగాహన చేయాలన్నారు. అన్ని వయసుల వారికి సరదానికి ఇచ్చే పండగ వినాయక చవితి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త కొండూరు సురేష్ , కామవరపుకోట మాజీ జడ్పిటిసి గంట సుధీర్ బాబు, సొసైటీ మాజీ అధ్యక్షులు సాయన కనకరాజు, మాజీ ఎంపీటీసీ చిలుకూరి సుబ్బారావు సిపిఐ నాయకులు టీవీఎస్ రాజు, బిరుదు గడ్డ రాజేష్, బాల గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాతో మహిళా ఉత్పత్తులకు విస్తృత మార్కెట్

- డిజిటల్ మార్కెటింగ్‌పై మహిళలకు అవగాహన కల్పించాలిలి
- తీసుకోవాల్సిన జాగ్రత్తలు పైనా అప్రమత్తం చేయాలి
- డీఆర్డీఏ సిబ్బందికి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచనలి



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 19, 2026:** స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేస్తున్న ఉత్పత్తులకు విస్తృత మార్కెట్‌ను కల్పించడంతో పాటు, వారిలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను డిజిటల్ మార్కెటింగ్ వైపు ప్రోత్సహించేందుకు సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని డీఆర్డీఏ సిబ్బందికి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. శనివారం ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి రైజ్ కేంద్రంలో 100 మంది డీఆర్డీఏ సిబ్బందికి సోషల్ మీడియా వినియోగం, డిజిటల్ మార్కెటింగ్‌పై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో డా. ఎన్. అపర్ణ రామకృష్ణారావు (ప్రాజెక్ట్ హెడ్, ఎక్స్ ఎల్ ఆర్ ఐబి సీజీఈఐఎల్, న్యూఢిల్లీ), ఎం.శ్రావణి పాల్గొని సోషల్ మీడియాపై 360 డిగ్రీల కోణంలో అవగాహన కల్పించారు.కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేస్తున్న ఆహార ఉత్పత్తులు, హస్తకళలు, సంప్రదాయ ఉత్పత్తులు, ఇతర వస్తువులను సోషల్ మీడియా వేదికల ద్వారా వినియోగదారులకు చేరువ చేయడం ద్వారా వారి వ్యాపార పరిధిని పెంచుకునే అవకాశం ఉందని... ఈ నేపథ్యంలో ఉత్పత్తుల నాణ్యత, ప్యాకేజింగ్, ఫొటోగ్ర ఫీ, ఉత్పత్తి వివరాల ప్రచారం, వినియో గదారు లతో నేరుగా అనుసంధానం వంటి అంశాలపై డిజిటల్ వేదికలను వినియోగిం చుకునే విధానం పై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బందే డిజిటల్ మార్పుకు వారధి శిక్షణ పొందిన సిబ్బంది కేవలం సోషల్ మీడియా వినియోగం పై అవగాహన కల్పించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో మహిళా సంఘాలతో కలిసి పనిచేస్తూ వారి ఉత్పత్తులను డిజిటల్ వేదికలపై ఎలా పరిచయం చేయాలి, వినియోగదారులను ఎలా చేరుకోవాలి, వ్యాపారాన్ని ఎలా విస్తరించు కోవాలి అనే అంశాలపై మార్గనిర్దేశం చేయాల న్నారు. ఈ క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పైనా అప్రమత్తం చేయాలన్నారు.గ్రామీణ ప్రాం తాల్లోని మహిళలు తమ ఉత్పత్తులను స్థానిక మార్కెట్లకే పరిమితం చేయకుండా, విస్తృత వినియోగదారుల వర్గానికి పరిచయం చేసుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. స్వయం సహా యక సంఘాల ద్వారా మహిళలకు అందుతు న్న ఆర్థిక, వ్యాపార అవకాశాలకు డిజిటల్ మా ర్కెటింగ్ మరింత బలం చేకూర్చనుందని.. ఉత్ప త్తుల విక్రయాలు పెరగడం ద్వారా మహి ళల ఆదాయ అవకాశాలు మెరుగుపడటం తో పా టు, స్థానిక స్థాయిలో చిన్న తరహా వ్యాపా రా లు అభివృద్ధి చెందేందుకు ఇది దోహదపడను ంద న్నారు.కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఏవీస్వీ నాం చారరావు తదితరులు పాల్గొన్నారు.సమాచార పౌర సంబంధాల శాఖ, ఎన్టీఆర్ జిల్లా ద్వారా జారీ

## నిబంధనల మేరకే నూతన పింఛన్ల మంజూరు



- అర్హతల పరిశీలనలో ఎలాంటి ఉల్లంఘనలకు తావివ్వరాదు
- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

**విజయవాడ రూరల్: సెప్టెంబర్ 19, 2026:** జిల్లాలో నూతనంగా దరఖాస్తు చేసుకున్న పింఛన్లను ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత అర్హతల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారికి మాత్రమే పింఛన్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు--2 కార్యాలయం నందు శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ నూతన పింఛన్లకు సంబంధించిన ఆన్లైన్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. దరఖాస్తుల నమోదు, అర్హతల పరిశీలన, సంబంధిత వివరాల నమోదు తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ, నూతన పింఛన్ల కోసం వచ్చిన ప్రతి దరఖాస్తును నిర్దేశిత అర్హతలు, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుదారుల అర్హతలను సంబంధిత రికార్డులు, అందుబాటులో ఉన్న సమాచారంతో సరిచూసిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హత లేని వ్యక్తులకు పింఛన్లు మంజూరు కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పింఛన్ల మంజూరు ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలను, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి ఉల్లంఘనలకు తావివ్వరాదని స్పష్టం చేశారు. నూతన పింఛన్లకు సంబంధించి సెప్టెంబర్ 21వ తేదీలోగా భౌతిక పరిశీలనను పూర్తి చేయాలని, అలాగే సెప్టెంబర్ 24వ తేదీలోగా తదుపరి ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువుల్లో ప్రక్రియ పూర్తయ్యేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పింఛన్ల మంజూరు ప్రక్రియలో పారదర్శకత, నిబంధనల అమలు, అర్హతల ఖచ్చితమైన నిర్ధారణకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే భౌతిక పరిశీలనను బాధ్యతాయుతంగా చేపట్టి, వాస్తవ పరిస్థితులను నిర్ధారించిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు చేపటాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి కె ఆర్ ఎస్ ఆర్ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి, ఆధార్ కోఆర్డినేటర్, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. జిల్లా సమాచార శాఖ, విజయవాడ నుండి జారీచేయడమైనది.

## ప్రసరణ కొరకు



**ఏలూరు, సెప్టెంబర్ 19 :** ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలో భూగర్భంలో ఉన్న బొగ్గు వెలుకతీత పనులకు రిలయన్స్ కంపెనీ పూనుకుంటున్నదని సిపిఐ జిల్లా కార్యదర్శ మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. బొగ్గు వెలుకతీతపై రైతులలో నెలకొన్న అనుమానాలు, ఆందోళనలు గురించి రైతుల అభిప్రాయాలను తెలుసుకోవడం కోసం ఈనెల 20వ తేదీ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో సిపిఐ ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ తదితర నాయకులు పాల్గొంటున్నారు. రైతులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలుపవలసిందిగా ఆయన కోరారు

## కూకట్‌పల్లి ఆదిత్యనగర్లో 19 రకాల గోదావరి రుచులతో అన్నసమారాదన



**హైదరాబాద్, సెప్టెంబర్ 19:** కేపీహెచ్‌బీ ఆదిత్య నగర్ పార్కు వద్ద వినాయకచవితి సందర్భంగా ఏలూరు జిల్లా కామవరపుకోటకు చెందిన వుయ్యూరు జగదీష్ ఆధ్వర్యంలో అఖండ అన్నసమారాధాన నిర్వహించారు. హైదరాబాద్‌లో ప్రతి యేటా వినాయకచవితి సందర్భంగా జగదీష్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహిస్తారు. ఈ సారి భిన్నంగా 19 రకాల ఆంధ్రా గోదావరి రుచులతో ఆంధ్రాలోని నూజివీడుకు చెందిన ప్రముఖ వంటమేస్త్రీ పుల్లయ్య టీం ఆధ్వర్యంలో వంటలు చేయించి బంతిభోజనం పెట్టారు. 1500 మందికి పైగా భక్తులు ఈ అఖండ అన్నసమారాధానలో పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో చాలా రోజుల తర్వాత 19 రకాల వంటలతో అద్భుతమైన గోదావరి రుచులతో బంతి భోజనంలో అన్నసమారాధన చేశారని ప్రశంసించారు. అన్న సమారాధనలో అన్నవరం ప్రసాద వితరణ చేశారు. అన్నసమారాధనలో దండోరా సినిమా నిర్మాత బెన్నీతో పాటు పలువురు సినీ, సీరియల్ ఆర్టిస్టుల పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన లడ్డూ వేలంలో తొలిలడ్డూను నీలేష్ చోప్రా – లక్ష్మీస్పందన దంపతులు రు. 61 వేలు, రెండో లడ్డూను మందలపు హనుమంతు రు. 47 వేలు, మూడో లడ్డూను లోహిత్‌చారి రు. 20 వేలకు సొంతం చేసుకున్నారు

## స్కూల్ యూనిఫామ్‌తో 50 ఏళ్లు వెనక్కి.. 'ఆత్మీయ సమ్మేళనం' అంటే ఇది కదా



ఈమధ్య పూర్వ విద్యార్థుల 'ఆత్మీయ సమ్మేళనాలు' తరచూ ఏదో చోట జరుగుతూనే ఉన్నాయి. చిన్నప్పుడు కలిసి చదువుకున్న దోస్తులంతా ఒక్కచోట చేరి అప్పటి జ్ఞాపకాలను తలచుకొని మురిసిపోతున్నారు. రీ-యూనియన్ వేడుకలో తమ బాల్యాన్ని, స్కూల్ డేస్‌ను యాది చేసుకొని 'ఆరోజులు మళ్లీ రావు' అనుకుంటారు. కానీ, డ్రెస్సింగ్, వ్యహరించే తీరు విషయంలో మాత్రం పెద్దవాళ్లం అన్నట్టుగానే ఉంటున్నారు. అయితే.. ఈ బ్యాచ్ మాత్రం విభిన్నం. కాదు కాదు చాలా చాలా ప్రత్యేకమని చెప్పాలి. ఎందుకో తెలుసా.. 50 ఏళ్ల తర్వాత స్కూల్లో కలిసిన వీరంతా విద్యార్థులుగా అప్పుడు ఎంత అల్లరి చేశారో, ఎంత సంతోషంగా గడిపారో అంత ఖుషీగా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు.ఆత్మీయ సమ్మేళనం అంటే.. చిన్నప్పటి రోజులు, కల్లాకపటం తెలియని దోస్తులు గుర్తుకొస్తారు. అందుకే.. రీ-యూనియన్ అనగానే అందరూ రెఢీ అయిపోతారు. కానీ, వీరు మాత్రం తమ ఆత్మీయ సమ్మేళనాన్ని చాలా గొప్పగా నిర్వహించుకున్నారు. రాకేశ్ నగర్ అనే ఇన్‌స్టాగ్రామ్ యూజర్ 1976 బ్యాచ్ తన స్నేహితులను కలిసినప్పటి వీడియో ఇది. ఈ సందర్భంగా తాము చేసిన అల్లరిని, బాల్యంలోకి తొంగి చూస్తూ గడిపిన అద్భుత క్షణాలను పంచుకున్న ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరలవుతోంది.

## 12 గంటల కరెంట్ ఇస్తున్నరో రైతులను అడుగుదామా సబ్‌స్టేషన్ తనిఖీలో కేటీఆర్ వీడియో



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం నాగర్ కర్నూల్ జిల్లాలో కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని పరామర్శించి తిరుగు ప్రయాణంలో వనపర్తి జిల్లా పెబ్బేరుకు చేరుకున్నారు. రైతులు సాగు నీరు, కరెంట్ కోతలతో సతమతమవుతున్న నేపథ్యంలో పెబ్బేరు మండలం గుమ్మడం క్రాస్ రోడ్డు వద్ద రైతులతో మాట్లాడారు. గుమ్మడం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన కేటీఆర్ సబ్‌స్టేషన్‌లోని లాగ్‌బుక్స్‌ను పరిశీలించారు. విద్యుత్ కోతల గురించి స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు రోజుకు 5 గంటలే కరెంట్ వస్తుంది సార్.. మాకు కెనాల్ కూడా బంద్ అయింది.. సబ్ స్టేషన్ సిబ్బంది 12 గంటలు కరెంట్ ఇస్తున్నమంటే.. ఇస్తున్నవా.. బయటకు రైతులను అడుగుదామా..? ఒకసారి అని కేటీఆర్ ప్రశ్నించారు. కరెంట్ గురించి అడిగితే పైననే పోయింది.. మాకేం తెల్వదని అధికారులు చెబుతున్నారు.. మా చేన్లు అయితే ఎండిపోతున్నయ్.. ఒకటే మడి పారుతుంది సార్ అంటూ రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 శాతం పనులు చేసిపోతే 10 శాతం పడావు పెట్టి పాలమూరు రైతులను తొక్కుతున్నవ్.. పాలమూరు రైతుల వ్యవసాయాన్ని నాశనం చేస్తా ఉన్నవ్ రేవంత్ రెడ్డి.. వాళ్లు మిమ్మల్ని తరుమక ముందే మన కేసీఆర్ హయాంలో ఎలా కరెంట్ వచ్చేదో. రైతులు సాగు నీరు, కరెంట్ కోతలతో సతమతమ వుతున్న నేపథ్యంలో పెబ్బే రు మండలం గుమ్మడం క్రాస్ రోడ్డు వద్ద రైతులతో మాట్లాడారు. మాకు కెనాల్ కూడా బంద్ అయింది..రైతులు సాగు నీరు, కరెంట్ కోతలతో సతమతమవుతున్న నేపథ్యంలో పెబ్బే రు మండలం గుమ్మడం క్రాస్ రోడ్డు వద్ద రైతులతో మాట్లాడారు. సబ్ స్టేషన్ సిబ్బంది 12 గంటలు కరెంట్ ఇస్తున్నమంటే.. ఇస్తున్నవా.. బయటకు రైతులను అడుగుదామా. గుమ్మడం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన కేటీఆర్ సబ్‌స్టేషన్‌లోని లాగ్‌బుక్స్‌ను పరిశీలించారు. విద్యుత్ కోతల గురించి స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు . వెంటనే అలా సరిదిద్దాలని ప్రభుత్వానికి, అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు.

# అసౌకర్యాల నడుమ ఆసియా క్రీడలు ప్రారంభం

### నగోయోలో వసతి ఏర్పాట్లకు తీవ్ర కొరత

### ఐఓఏ రూ.3కోట్లతో అథ్లెట్లకు బస ఏర్పాటు



**నగోయో:** 20వ ఆసియా క్రీడలు జపాన్‌లోని ఐచి-నగోయో వేదికగా శనివారం నుంచి ప్రారంభం కాగా.. వసతి ఏర్పాట్లు, ప్రయాణ, భోజన ఏర్పాట్లపై అథ్లెట్లనుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇక భారత షాట్‌పు టర్ తజిందర్‌పాల్ సింగ్ తూర్‌తో పాటు అథ్లెట్లకు నిర్ణీత సమయానికి అందాల్సిన కిట్ అందకపోవడంతో తజిందర్ స్థానంలో కబడ్డీ క్రీడాకారుడు పవన్ సెహ్రావత్ ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొనాల్సి వచ్చింది. ఈ విషయంపై తజిందర్ పాల్ స్పందిస్తూ.. 'నా అఫీషియల్ కిట్ భారత్‌లోనే ఉంది. అది మధ్యాహ్నం 3 గంటల కు నగోయాకు వస్తుందన్నారు. నగోయా విమానాశ్రయానికి వెళ్లి ఆ కిట్ అందుకొని ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొనడం చాలా కష్టం. ఈ నేపథ్యంలో ప్రారంభోత్సవాలకు రాలేనని భారతీయ ఒలింపిక్ సంఘానికి(ఐఓఏ) సమాచారం అందించా.. అలాగే అథ్లెటిక్స్ టీమ్‌లో ఎవరికీ ఇప్పటివరకు కిట్లు అందలేదని' తెలిపాడు.

**వసతి ఏర్పాట్లపైనా తీవ్ర విమర్శలు..**వసతి, భోజన సాధన ఏర్పాట్లపై అథ్లెట్లు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా నగోయోలో ఉన్న అథ్లెట్లు అక్కడి సౌకర్యాలు, ఏర్పాట్లు సరిగా లేకపోవడంతో నిద్రపోవడం కష్టంగా ఉందంటూ పోస్ట్‌లు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆసియా క్రీడల కమిటీ చైర్మన్ తయ్యబ్ ఇక్రమ్ మాట్లాడుతూ.. పెద్ద క్రీడా ఈవెంట్ల నిర్వహణలో పలు సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తుందని, గత కొన్ని రోజులుగా వసతి, ఇతర సౌకర్యాల విషయంలో అథ్లెట్లు తీవ్ర విమర్శలు చేస్తున్న మాట వాస్తవమేనని, కొన్ని సమస్యలు ఉన్న మాట వాస్తవమేనని, దీనిని రాజకీయం చేయడం సరికాదన్నారు. వాటన్నింటిని సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని, అథ్లెట్ల ప్రాక్టీస్‌కు వసతి గదుల వద్ద సాధన కిట్లను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే 2030, 2034 ఆసియా క్రీడల్లో గేమ్స్ విలేజ్‌లు కూడా ఇలానే ఉంటాయని చెప్పడం, ఖర్చులు తగ్గించుకోవడానికి ఇలా చేశామని ఆయన బహిరంగంగా ప్రకటించడం పలు విమర్శలకు దారితీసింది.

**ఐఓఏ సొంత ఖర్చులతో...**నగోయాలో గదుల కొరత తీవ్రంగా ఉండటంతో భారత ఒలింపిక్ అసోసియేషన్(ఐఓఏ) దాదాపు రూ.3కోట్ల రూపాయల సొంత ఖర్చులతో ఆఘమేఘాలమీద ఏర్పాట్లు చేసింది. ప్రారంభోత్సవ వేడుకల నాటికి భారత పూర్తి బృందం(503మంది అథ్లెట్లు) నగోయాకు చేరుకోనున్న క్రమంలో ఐఓఏ ఈ ఏర్పాట్లు చేసింది. అలాగే అథ్లెట్లు తీసుకొనే ఆహారం(డైట్) విషయంలోనూ కొరత ఉంది. అథ్లెట్లకు నిర్దిష్టమైన క్యాలరీల అవసరం ఉంటుంది కాబట్టి అందులో ఏమైనా సమస్య ఉంటే అది నిర్వాహకులపై చెడు ప్రభావం చూపుతుందని, అవసరమైన మెనూల రకాలపై సంప్రదించిన తర్వాతే క్యాటరింగ్‌కు ఆర్డర్ చేయనున్నట్లు సమాచారం. ఇక 2038 ఆసియా క్రీడలకు ఆతిథ్య హక్కుల రేసులో ముందంజలో ఐఓఏకి ఇది పెద్ద ఎదురుదెబ్బ అని చెప్పవచ్చు. ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు పి.టి. ఉష, క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవియా ముఖ్య అతిథులుగా హాజరైన ఆసియా క్రీడల ప్రారంభోత్సవం నాటికి త్రివర్ణ పతకం, అథ్లెట్ల కిట్స్ సరైన సమయానికి అందరకపోవడం పలు విమర్శలకు దారి తీసింది.

**మను బకర్ భావోద్వేగం...** ప్రారంభోత్సవ వేడుకల్లో భారత త్రివర్ణ పతకాన్ని మోసిన ఒలింపిక్ పతక విజేత మను బకర్ భావోద్వేగానికి గురైంది. తనకు ఎంతో ప్రాముఖ్యత కలిగిన రోజున తన దివంగత కోచ్ జస్పాల్ రాణా లేకపోవడం తనను కలచివేసిందని ఆమె పేర్కొంది. "ఈ రోజు జస్పాల్ సార్‌ను చాలా మిస్ అయ్యాను. నా పక్కన ఆయన లేకపోవడం నిజంగా ఒక భావోద్వేగ భరితమైన రోజుగా అనిపించింది," అని ప్రారంభోత్సవ వేడుకల అనంతరం ఆమె తెలిపింది. మాజీ ఒలింపిక్ ఛాంపియన్ షూటర్, కోచ్ జస్పాల్ రాణా, జూన్ 11న 49 ఏళ్ల వయసులో కన్నుమూశా రు. భాకర్ కెరీర్‌లో ఆయన ఎంతో కీలక పాత్ర పోషించడమే కాకుండా, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు సాధించేలా మార్గనిర్దేశం చేశారు.



# తెలంగాణ షో జంపింగ్ చాంపియన్‌షిప్ షురూ

హైదరాబాద్: నాసర్ పోలో -- ఈక్వెస్ట్రియన్ అకాడమీ వేదికగా తెలంగాణ షో జంపింగ్ చాంపియన్‌షిప్ శనివారం ఉత్సాహంగా ప్రారంభమైంది. యువ రైడర్లు తమ గుర్రాలతో ప్రదర్శించిన విన్యాసాలు అలరించాయి. 115-120 సెం.మీ షో జంపింగ్ ఓపెన్ కేటగిరీలో ది అశ్వ కలెక్టివ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మహమ్మద్ హాషమ్ కాని కాంగ్ గుర్రంపై అద్భుత ప్రదర్శన చేసి మొదటి స్థానంలో నిలిచాడు. డెల్లానో డబ్ల్యూ గుర్రంపై స్వారీ చేసిన స్నేథిల్ (కోవై స్టేబుల్స్) రెండో స్థానం సాధించగా, ది అశ్వ కలెక్టివ్ కే చెందిన మహమ్మద్ అమాన్ అలీ మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు.

# స్టేట్ ర్యాంకింగ్ టీటీ విజేత జతిన్



హైదరాబాద్: జేఈఈ, ఈఏమ్‌సెట్ పోటీ పరీక్షల కోసం రెండేళ్ల పాటు క్రీడలకు దూరంగా ఉన్న తెలంగాణ యువ ప్యాడ్లర్ జతిన్ దేవ్ అద్భుత పునరాగమనం చేశాడు. తెలంగాణ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో అండర్-19 బాలుర విభాగంలో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఎల్బీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో జతిన్ 4-1 తేడాతో ప్రియాన్‌పై విజయం సాధించాడు. 2024 నేషనల్ స్కూల్ గేమ్స్ చాంపియన్‌గా, వివిధ కేటగిరీల్లో ఆరుసార్లు స్టేట్ చాంపియన్‌గా నిలిచిన జతిన్ దేవ్ ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ (ఏఐఎంఎల్) చదువుతున్నాడు. రీఎంట్రీ ఇచ్చిన తొలి టోర్నీలోనే అండర్-19 టైటిల్ గెలిచి తన సత్తాను చాటుకున్నాడు.



# తెక్‌బాల్ సెమీస్‌లో కంగుతిన్న డిసౌజా..

# ఇక ఆశలన్నీ కాంస్యంపైనే..!

జపాన్ వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడల్లో పసిడి పతకంపై ఆశలు రేపిన క్వింసీ డిసౌజా నిరాశపరిచింది. ఆరంభ వేడుకల రోజే తను 'తెక్‌బాల్' సెమీస్‌లో అనూహ్యంగా ఓటమి పాలైంది. మహిళల సింగిల్స్‌లో సుమయా(ఇండోనేషియా) చేతిలో పరాజయం చవిచూసిన డిసౌజా ఆదివారం కాంస్యం కోసం పోరాడనుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్‌కే చెందిన మొహమ్మద్ అనస్ ఇమ్రాన్ బేగ్‌తో కలిసి మూడో స్థానంలో నిలిచేందుకు తను సిద్ధమవుతోంది.అరంగేట్రం ఆసియా క్రీడల్లో గ్రూప్ దశలోనే అత్యధిక పాయింట్లతో చరిత్ర సృష్టించిన క్వింసీ డిసౌజా తెక్‌బాల్ సెమీఫైనల్ దాటలేకపోయింది. వరస సెట్లలో తేలిపోవడంతో తను ఇక కాంస్యంపైనే ఆశలు పెట్టుకుంది. శనివారం సుమయా (ఇండోనేషియా)తో జరిగిన మ్యాచ్ ఆరంభంలో దూకుడు కనబరిచిన 24 ఏళ్ల డిసౌజా తొలి సెట్‌ను 12-7తో గెలుచుకుంది. కానీ, రెండో సెట్‌లో భారత అథ్లెట్ జోరుకు సుమ య అడ్డుకట్ట వేస్తూ.. 12-9తో విజయం సాధించి స్కోర్ సమం చేసింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లో డిసౌజా పుంజుకున్నా సరిపోలేదు. చివరకు 12-7తో భారత అథ్లెట్‌ను ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది సుమయా.ఫైనల్ బెర్తు చేజారినా నగోయలో పోడియం మీద నిల్చునేందుకు డిసౌజాకు ఇంకా అవకాశముంది. కాంస్య పతక పోరులో భాగంగా.. మూడో స్థానం కోసం కంబోడియాకు చెందిన క్రీడాకారిణి కౌయెంయాన్ డీని డిసౌజా ఎదుర్కోనుంది. గ్రూప్ దశలో కౌయెంయూన్‌ను చిత్తు చేసి నేరుగా సెమీస్ చేరిన భారత అథ్లెట్.. ఈసారి కూడా అదిరే ఆటతో ప్రత్యర్థికి చెక్ పెట్టాలనుకుంటోంది. సెప్టెంబర్ 20 ఆదివారం ఉదయం 10 గంటలకు వీరి మ్యాచ్ జరుగనుంది.

# సెమీస్‌లో క్వీమ్సీ ఓటమి



టెక్‌బాల్‌లో భారత ప్లేయర్ క్విన్సీ డిసౌజా ఫైనల్ చేరే అవకాశాన్ని చేజార్చుకుంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో 24 ఏండ్ల క్వీమ్సీ 12-7, 9-12, 7-12తో ఇండోనేషియాకు చెందిన సుమయా చేతిలో ఓటమి పాలైంది. తొలి గేమ్ నెగ్గినా అదే జోరు కొనసాగించలేకపోయింది. దాంతో ఆదివారం జరిగే కాంస్య పోరులో పతక అదృష్టాన్ని పరీక్షించుకోనుంది.

# భారత్, శ్రీలంకకు షాకిస్తూ..

# టీ20ల్లో అగ్రస్థానానికి ఇంగ్లండ్..!




అంతర్జాతీయ పురుషుల టీ20ల్లో ఇంగ్లండ్ జోరు కొనసాగుతోంది. స్వదేశంలో భారత్‌ను వైట్‌వాష్ చేసిన ఇంగ్లండ్.. ఇప్పుడు శ్రీలంక(రాతీఅశ్రీఖఅఝ)ను క్లీన్‌స్వీప్ చేసి ఐసీసీ నంబర్ 1 ర్యాంక్ పట్టేసింది. రెండు రోజుల క్రితం రెండో స్థానంలో ఉన్న హ్యారీబ్రూక్ సేన మూడో టీ20లో అద్భుత విజయంతో టీమిండియాను వెనక్కి నెట్టింది. 1,1021 పాయింట్లు, 269 రేటింగ్స్‌తో అగ్రస్థానానికి ఎగబాకింది ఇంగ్లండ్.స్వదేశంలో పంజా విసురుతున్న ఇంగ్లండ్ పురుషుల టీ20 టీమ్ ర్యాంకింగ్స్‌లో దుమ్మురేపింది. ఈమధ్యే సొంతగడ్డపై ఐదు టీ20ల సిరీస్‌లో భారత జట్టును వైట్‌వాష్ చేసిన హ్యారీ బ్రూక్ సేన.. ఈసారి శ్రీలంక పని పట్టింది. మూడు టీ20ల సిరీస్‌లో లంకను చిత్తు చిత్తుగా ఓడించిన ఇంగ్లండ్ నంబర్ 1 ర్యాంకు కైవసం చేసుకుంది.



# సినిమాలకు ఇక కఠిన నిబంధనలు..

## డ్రగ్స్ సీన్లపై తప్పనిసరి హెచ్చరిక!

సినిమాల్లో ఏం చూపించాలనే విషయంలో ఇక మరింత కఠిన నిబంధనలు అమల్లోకి వచ్చాయి. డ్రగ్స్, హింస, లైంగిక హింస, చిన్నారులపై వేధింపుల వంటి సున్నిత అంశాల చిత్రీకరణపై కేంద్రం కొత్త మార్గదర్శకాలు తీసుకొచ్చింది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ శుక్రవారం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ)కు సంబంధించిన సవరించిన మార్గదర్శకాలను ప్రకటించింది. 1991లో జారీ చేసిన నిబంధనల స్థానంలో ఇవి వచ్చాయి.డ్రగ్స్ తీసుకోవడం లేదా అక్రమంగా తరలించే సన్నివేశాలు ఉంటే ఇక తెరపై తప్పనిసరిగా హెచ్చరిక కనిపించాలి. »»Illicit narcotics destroy health and guarantees imprisonment. Say No To Drugs" అనే సందేశాన్ని ప్రదర్శించాలి. మద్యం, డ్రగ్స్, పొగాకు అలవాట్లను సమర్థించేలా లేదా గొప్పగా చూపించే సన్నివేశాలు సినిమాల్లో ఉండొద్దని నిబంధనలు చెబుతున్నాయి.

హింసను సమర్థించేలా కానీ, గొప్పగా చూపించేలా కానీ సన్నివేశాలు ఉండకూడదు. మహిళలను కించపరిచే సన్నివేశాలు, లైంగిక వేధింపులు, లైంగిక హింసను అవసరానికి మించి చూపించకూడదు. కథకు తప్పనిసరిగా అవసరమైన సందర్భాల్లోనూ ఇలాంటి సన్నివేశాలను సాధ్యమైనంత తక్కువగా ఉంచాలని నిబంధనలు చెబుతున్నాయి.చిన్నారులను హింసకు బాధితులుగా, హింసకు పాల్పడేవారిగా చూపించడాన్ని కూడా నివారించాలని సూచించారు. పిల్లలపై ఎలాంటి వేధింపులనూ చూపించకూడదు. దివ్యాంగులను ఎగతాళి చేసేలా, అవమానించేలా సన్నివేశాలు ఉండకూడదు. జంతువులపై అనవసరమైన హింసను కూడా చూపించొద్దని నిబంధనల్లో స్పష్టం చేశారు.మతాలు, వర్గాలను కించపరిచేలా ఉండే మాటలు, దృశ్యాలపై ఆంక్షలు కొనసాగనున్నాయి. సామాజిక విద్వేషం, మూఢనమ్మకాలు, శాస్త్రవిరుద్ధ భావనలు, దేశ వ్యతిరేక ధోరణులను ప్రోత్సహించే కంటెంట్‌కు కూడా చోటు ఉండదు. కోర్టుల గౌరవాన్ని దెబ్బతీసే సన్నివేశాలపైనా నిబంధనలు ఉన్నాయి.

# ఆ హాలీవుడ్ రీమేక్‌లో ఉచితంగానైనా నటిస్తా : విజయ్ సేతుపతి



విలక్షణ నటనతో దక్షిణ భారతదేశంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి తన రాబోయే చిత్రాలు, హాలీవుడ్ రీమేక్ ఆఫర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల దర్శకుడు నిథిలన్ స్వామినాథన్ తనకు 'మహారాజా 2' కథను వినిపించారని, ఆ కథ వినగానే తనకు ఎంతగానో నచ్చిందని వెల్లడించారు. 'మహారాజా' మొదటి భాగం విడుదల కాకముందు కొందరు అనుమానాలు వ్యక్తం చేసినప్పటికీ, తాను మాత్రం సినిమా విజయంపై గట్టి నమ్మకంతో ఉన్నానని గుర్తుచేసుకున్నారు.

అంతేకాకుండా, 'మహారాజా' సినిమాకు సంబంధించి ఇటీవల హాలీవుడ్ నుంచి ఒక భారీ సర్ ప్రైజ్ వచ్చిందని విజయ్ సేతుపతి తెలిపారు. ఈ సినిమా రీమేక్ హక్కులను హాలీవుడ్ సంస్థ దక్కించుకుందని, అందులో ప్రముఖ హాలీవుడ్ స్టార్ నటుడు మాథ్యూ మెక్‌కొనాహే నటించబోతున్నారని నిర్మాత తనకు ఫోన్ చేసి చెప్పినట్లు వివరించారు. ఈ వార్త విన్నవెంటనే తాను ఎంతో థ్రిల్ అయ్యానని... "ఆ హాలీవుడ్ రీమేక్‌లో నాకు ఒక చిన్న పాత్ర ఇప్పించండి. ఉచితంగా నటిస్తాను" అని నిర్మాతతో సరదాగా అన్నట్లు పంచుకున్నారు. మొదటి నుంచి హాలీవుడ్‌లో నటించాలనే కోరిక ఉందని, తన చిత్రం అక్కడ రీమేక్ కావడం ఎంతో గర్వంగా ఉందని చెప్పారు.



# ఆస్కార్ రేసులో మరాఠీ చిత్రం 'గోంధాల్'..

99వ అకాడమీ అవార్డుల (ఆస్కార్) కోసం భారత్ నుంచి అధికారిక ఎంట్రీగా ఏ చిత్రం వెళ్తుందనే ఉత్కంఠకు తెరపడింది. దేశవ్యాప్తంగా పలు భాషల నుంచి వచ్చిన సినిమాలను పరిశీలించిన ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జ్యూరీ, అనూహ్యంగా మరాఠీ థ్రిల్లర్ చిత్రం 'గోంధాల్'ను ఎంపిక చేసింది. ఈ రేసులో గట్టి పోటీదారుగా నిలిచిన, బాక్సాఫీస్ వద్ద సుమారు రూ.3,000 కోట్లు వసూలు చేసిన రణ్‌వీర్ సింగ్ 'ధురంధర్' ఫ్రాంచైజీకి నిరాశే ఎదురైంది.ఈ ఎంపిక ప్రక్రియలో 14 మంది సభ్యులున్న జ్యూరీలో ఒకరైన వివేక్ వాస్వానీ, 'ఎన్డీటీవీ'తో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. 'ధురంధర్' సినిమాను ఎందుకు ఎంపిక చేయలేదనే ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. "కొంతమంది సభ్యులకు ఆ సినిమా నచ్చింది. కానీ, అది ఆస్కార్ స్థాయి సినిమా అని మేము భావించలేదు. మేము ఆశించిన విధంగా అందులో భారతీయ సంస్కృతి ప్రతిబింబించలేదు" అని స్పష్టం చేశారు. 14 మంది జ్యూరీ సభ్యులలో కేవలం నలుగురు మాత్రమే 'ధురంధర్'కు ఓటు వేశారని ఆయన తెలిపారు. మరోవైపు, భారత్ తరఫున ఆస్కార్ బరిలో నిలవనున్న 'గోంధాల్' చిత్రాన్ని సంతోష్ దవాఖర్ రచించి, దర్శకత్వం వహించారు. మహారాష్ట్రలో అర్ధరాత్రి నిర్వహించే 'గోంధాల్' అనే సంప్రదాయ ఆచారాలు, జానపద కళల




నేపథ్యంలో ఈ థ్రిల్లర్ రూపుదిద్దుకుంది. చిత్రంలో భారతీయ సంస్కృతిని, సంప్రదాయాలను బలంగా చూపించడం జ్యూరీని ఎంతగానో ఆకట్టుకుంది.

ఈ చిత్రం ఇప్పటికే పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రశంసలు అందుకుంది. 2025లో జరిగిన 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ)లో దర్శకుడు సంతోష్ దవాఖర్ ఉత్తమ దర్శకుడిగా సిల్వర్ పీకాక్ అవార్డును గెలుచుకున్నారు. ఈ చిత్రంలో కిషోర్ కదమ్, ఇషితా దేశ్‌ముఖ్, యోగేష్ సోహోని ప్రధాన పాత్రలు పోషించగా, ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా సంగీతం అందించారు.

ఈ ఏడాది ఆస్కార్ ఎంట్రీ కోసం మొత్తం 33 చిత్రాలు పోటీపడ్డాయి. వీటిలో 14 హిందీ, 4 మరాఠీ, 4 తెలుగు, 3 గుజరాతీ, 3 తమిళ చిత్రాలతో పాటు మలయాళం, నేపాలీ, నాగాలాండ్ నుంచి ఒక్కో సినిమా ఉన్నాయి. చివరి దశలో 'గోంధాల్', 'అంగ్', 'మైనే వాపస్ ఆయుంగా' అనే మూడు చిత్రాలు నిలవగా, తుది ఎంపికలో జ్యూరీ 'గోంధాల్' వైపే మొగ్గు చూపింది.

ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన 'ధురంధర్' ఫ్రాంచైజీ, 2025 డిసెంబర్, 2026 మార్చిలో రెండు భాగాలుగా విడుదలై ప్రపంచవ్యాప్తంగా భారీ విజయం సాధించింది. అయినప్పటికీ వాణిజ్య విజయాల కన్నా సాంస్కృతిక ప్రాధాన్యతకే జ్యూరీ పెద్దపీట వేయడంతో ఈ ప్రతిష్ఠాత్మక అవకాశం మరాఠీ చిత్రానికి దక్కింది.

# జీవితంపై అమితాబ్ పాఠం..



బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ తన బ్లాగ్ వేదికగా జీవితానికి సంబంధించిన ఒక ముఖ్యమైన పాఠాన్ని పంచుకున్నారు. నిరంతర ప్రయత్నం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, జీవితంలోని సవాళ్లను ఆయన ఒక ఆటోమేటిక్ లిఫ్ట్ డోర్‌తో పోల్చారు. ఆయన వ్యక్తం చేసిన ఈ అభిప్రాయాలు ప్రస్తుతం ఎంతోమందికి స్ఫూర్తినిస్తున్నాయి.ఈ సందర్భంగా ఆయన ఒక ఆసక్తికరమైన విషయాన్ని ప్రస్తావించారు. "కొన్ని పనులు చెప్పకుండానే జరిగిపోతాయి, మరికొన్ని చెబితే జరుగుతాయి, ఇంకొన్ని కాస్త ఒత్తిడి చేస్తే గానీ పూర్తి కావు. అయితే, ఏదో ఒక మార్గంలో పని జరగడం మాత్రం ఖాయం" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. దీనిని వివరిస్తూ లిఫ్ట్ డోర్ ఉదాహరణను ఆయన వివరించారు. "లిఫ్ట్ ఆటోమేటిక్ డోర్ కొద్దిసేపటి తర్వాత దానంతట అదే మూసుకుపోతుంది. మనం లోపలికి ప్రవేశించడంలో ఆలస్యం చేస్తే, అది మూసుకోబోతుంది. కానీ ఆ సమయంలో ఒక చిన్న వేలు అడ్డుపెట్టినా చాలు, అది తిరిగి తెరుచుకుంటుంది" అని పేర్కొన్నారు.ఈ ఉదాహరణను జీవితానికి అన్వయిస్తూ.. "జీవితంలో కూడా అంతే. ఒక చిన్న ప్రయత్నం సైతం మూసుకుపోయిన తలుపులను తెరుస్తుంది. ఆ ప్రయత్నం ఒక వేలు పెట్టినంత స్వల్పమైనా సరే, ఫలితం ఉంటుంది. ప్రయత్నించకుండా ఏదీ లభించదు! నిరంతరం ప్రయత్నిస్తూనే ఉండండి... ఏదో ఒక రోజు ఆ తలుపు విసిగిపోయి తనంతట తానుగా తెరుచుకుంటుంది" అని అమితాబ్ తన సందేశాన్ని ముగించారు. ఎంత చిన్నదైనా సరే, నిరంతరం చేసే ప్రయత్నం చివరికి మూసుకుపోయిన అవకాశాల తలుపులను సైతం తెరుస్తుందన్నదే ఆయన మాటల సారాంశం.

# ప్రతి సీన్ సర్‌ప్రైజ్ చేస్తుంది...

## 'హతః' చాలా స్పెషల్: కిరణ్ అబ్బవరం



యువ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ ప్రయాణం సాగిస్తుండడం తెలిసిందే. ఆయన తన సొంత నిర్మాణ సంస్థ 'కేఏ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి 'హతః' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనుష్ గోరక్ దర్శకత్వం వహిస్తున్న ఈ మిస్టికల్ థ్రిల్లర్ మూవీ టీజర్‌ను హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఘనంగా విడుదల చేశారు. నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా, ప్రతి ప్రేక్షకుడిని ఆశ్చర్యపరిచేలా ఉంటుందని కిరణ్ అబ్బవరం ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, ""హతః' మాకు చాలా ప్రత్యేకమైన చిత్రం. ఈ దీపావళికి ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని అందించబోతున్నాం. సినిమా చూస్తున్నంత సేపు తర్వాత ఏం జరుగుతుందనే ఉత్కంఠ ప్రతి సన్నివేశంలోనూ ఉంటుంది. సినిమా పూర్తయ్యాక, అందులోని లింక్ పాయింట్స్ గుర్తుకు తెచ్చుకోవడానికి నాకే పది నిమిషాలు పట్టింది. దర్శకుడిని అడిగి మరీ అన్ని విషయాలు తెలుసుకున్నాను. అంత లోతైన కథ ఇది. నేను నిర్మాతగా ఈ ప్రాజెక్టులోకి మధ్యలో అడుగుపెట్టాను. ప్రాంతీయ బేధాలు లేకుండా అందరూ ఆస్వాదించేలా ఈ సినిమా ఉంటుంది, అందుకే అన్ని భాషల్లోనూ విడుదల చేస్తున్నాం" అని వివరించారు.చిత్ర దర్శకుడు అనుష్ గోరక్ మాట్లాడుతూ, "ఇది ఒక మిస్టికల్ థ్రిల్లర్. హారర్ అంశాలు కూడా ఉంటాయి. కథలో చాలా రహస్యాలు ఉన్నాయి, వాటిని థియేటర్లలో చూస్తేనే ఆ అనుభూతి దక్కుతుంది" అని తెలిపారు. మరో నిర్మాత శివశంకర నాయుడు మాట్లాడుతూ, "ఎలాంటి ప్రాంతీయ హద్దులు లేని అరుదైన సినిమా ఇది. ఏ ప్రాంతం వారు చూసినా తమ కథలాగే అనిపిస్తుంది. సాంకేతికంగా ఉన్నత స్థాయిలో ఉంటుంది" అని అన్నారు.బిగ్ బాస్ షోకి వెళ్లకముందే ఈ చిత్రంలో నటించానని నటి తనూజ పుట్టుస్వామి తెలిపారు. మూడేళ్ల తమ ప్రయాణం గురించి, దర్శకుడి విజన్ గురించి ఆమె వివరించారు. కో-ప్రొడ్యూసర్, నటుడు కుష్లు మాట్లాడుతూ, విజువల్స్ హాలీవుడ్ స్థాయిలో ఉన్నాయని, అనుష్ లాంటి దర్శకులు టాలీవుడ్‌కు అవసరమని అన్నారు.రెహమాన్, కుష్లు, తనూజ పుట్టుస్వామి, నమ్రిత కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని కిరణ్ అబ్బవరం సమర్పణలో శివశంకర నాయుడు నిర్మిస్తున్నారు. జేసిన్ జార్జ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నవంబర్ 6న థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త థ్రిల్‌ను పంచేందుకు సిద్ధమవుతోంది.

# బ్లాక్ డ్రెస్‌లో హీట్ పెంచేసిన మృణాల్ ఠాకూర్..



తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సీతారామం'తో చెరగని ముద్ర వేసుకున్న అందాల భామ మృణాల్ ఠాకూర్, తాజాగా పోస్ట్ చేసిన హాట్ పిక్స్‌తో సోషల్ మీడియాలో సెగలు రేపుతోంది. క్లాసీ బ్లాక్ డ్రెస్‌లో తనదైన స్టైల్ మార్క్ చూపిస్తూ ఈ ముద్దుగుమ్మ ఇచ్చిన పోజులు నెటిజన్లను అవాక్కయ్యేలా చేస్తున్నాయి. సింపుల్ అండ్ ఎలిగెంట్ లుక్‌లో దేవకన్యలా మెరిసిపోతున్న మృణాల్ పిక్స్ ప్రస్తుతం ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతూ ఫ్యాన్స్‌ను తీవ్రంగా ఆకట్టుకుంటున్నాయి.ఈ ప్రత్యేక ఫోటోషూట్ కోసం మృణాల్ ఠాకూర్ 'షాహిన్ మన్నన్' బ్రాండ్‌కు చెందిన ప్యాఫీ ఫ్లవర్ బ్లౌజ్ అండ్ స్టేట్‌మెంట్ స్కర్ట్ అవుట్‌ఫిట్‌ను ఎంచుకుంది. ఇక ఫుల్ స్లీవ్స్ క్రాప్డ్ బ్లౌజ్, దానికి తగ్గట్టుగా ఉన్న హై-వేస్ట్ ఫుల్లీ ఫ్లేర్డ్ స్కర్ట్‌పై కింద భాగంలో ఎరుపు రంగు పూల ఎంబ్రాయిడరీ వర్క్ ఆమె లుక్‌కు గ్రాండ్ అప్పీల్‌ను తెచ్చిపెట్టింది. నడుము వద్ద సన్నని బెల్ట్, డోప్ కట్స్‌తో మృణాల్ ఎంతో రాయల్‌గా మెరిసిపోయింది నెట్టింట లైకుల వర్షం: ఈ అద్భుతమైన పిక్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయగానే ఫ్యాన్స్ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. "బ్రీత్‌టేకింగ్ ప్రిన్సెస్", "అబ్సల్యూట్లీ స్టన్నింగ్ అండ్ గార్జియస్", "బ్లాక్ కలర్‌లో నీ అందం వేరే లెవెల్" అంటూ నెటిజన్లు పొగడ్తలతో నింపేస్తున్నారు. వెలుతురులో చిరునవ్వుతో ఉన్న మృణాల్ పిక్స్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచాయి. బుల్లితెర నుంచి స్టార్ హీరోయిన్ వరకు : మహారాష్ట్రకు చెందిన మృణాల్ ఠాకూర్, 'కుంకుమ భాగ్య' సీరియల్‌తో మంచి పాపులారిటీ సాధించి, 'లవ్ సోనియా' చిత్రంతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. 'సుపర్ 30', 'బాట్లా హౌస్' చిత్రాల్లో నటిగా మెప్పించిన ఈ భామ, 'సీతారామం'తో పాన్ ఇండియా లెవెల్లో భారీ క్రేజ్ సంపాదించుకుంది. ఇక ఆ తర్వాత 'హాయ్ నాన్న', 'జర్సీ', 'ది ఫ్యామిలీ స్టార్' వంటి చిత్రాలతో వరుస విజయాలు అందుకుంది.! ఇక రీసెంట్ గా సిద్ధాంత్ చతుర్వేదితో కలిసి 'దో దివానే షెహర్ మే', అడివి శేష్ సరసన బైలింగువల్ డ్రామా 'డెకాయిట్: ఏ లవ్ స్టోరీ', వరుణ్ ధావన్‌తో కలిసి 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' చిత్రాల్లో నటించి మంచి సక్సెస్ అందుకుంది..ఇక తన అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్‌తో పాటు విభిన్నమైన పాత్రలతో ఆకట్టుకుంటున్న మృణాల్ ఠాకూర్, రాబోయే రోజుల్లో అన్ని భాషల్లోనూ మరిన్ని భారీ విజయాలు సాధించాలని అభిమానులు కోరుకుంటున్నారు.



Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com